Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

షైన్
సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల
డా॥ SK. మహమ్మద్ అలి
ఫోన్: 0861 - 2340032

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు • స్థాపితం: 1930
Longest Living Newspaper in Telugu Journalism

# జమీన్ రైతు

సంపుటి: 80 • సంచిక: 45 • 23-10-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

లేజర్ చికిత్స
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
ఫోన్: 2303300

# రాష్ట్రంలో ఇంత చోటిస్తే చాలు!



## కెవిపిపై వైఎస్ కుటుంబం కినుక

జగన్‌ను ముఖ్యమంత్రి చేయడంలో వైఫల్యం చెందడానికి కెవిపి అనుసరించిన పొరపాటు పోకడే కారణమని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబీకులు భావిస్తున్నారు. వారిలో కొందరు ఈ అభిప్రాయాన్ని బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ బ్రతికి వుండగా కూడా కెవిపి మీద ఆయన కుటుంబంలోని చాలా మందికి కష్టం వుండేది. తన కుటుంబసభ్యులంటే ఎంత ప్రీతి వున్నప్పటికీ, వైఎస్ మాత్రం కెవిపి విషయంలో నిక్కచ్చిగా వుండేవాడు. ఎవరు ఏమి చెప్పినా విన్పించుకొనేవాడు కాదు. చివరి వరకు వారిద్దరి స్నేహం అవిచ్ఛిన్నంగా నిలిచింది. ఇప్పుడు వైఎస్ లేదు. దానితో ఎప్పటి నుంచో కెవిపి మీద కోపం వున్నవారు, జగన్ ముఖ్యమంత్రిత్వ ప్రయత్నం విఫలం కావడా

కొరవ 14వ పేజీలో

## కార్టూన్ స్కేప్




ఏం కొనేట్టు లేదు తినేట్టు లేదు...
మనం కూడా పైకి పోవాల్సిందేనా మామ!

- కాళ్లబేరానికి వచ్చిన జగన్.
- శృతిమించితే అసలుకే మోసమని భయం.
- తిరుగుబాట్లు, గిరుగుబాట్లు లేనే లేవు.
- రోశయ్యతో సర్దుకపోతేనే వ్యాపారాలకు మనుగడ
- ఎమ్మెల్యేల నోటికి ఇక తాళం.

దింపుడు కళ్లం ఆశతో ఢిల్లీకి వెళ్లిన వైఎస్ జగన్, పోరాడితే పోయేది తప్ప వచ్చేది ఏమీ లేదన్న నిజాన్ని అర్థం చేసుకొన్నాడు. అధిష్టానంతో మజాకాలాడితే అసలుకే మోసం తప్పదన్న భీతికి లోనైనాడు. మహారాష్ట్ర ఎన్నికల తర్వాత సోనియాగాంధీ తనను పిలిచి, ముఖ్యమంత్రి పీఠం అప్ప చెప్తుందన్న ఆశ ఒకటి జగన్‌లో, ఆయన వర్గంలో కొట్టుకలాడుతూ వుండింది. ఢిల్లీ నుంచి ఏ క్షణమైనా ఫోన్‌కాల్ వస్తుందని రోజుల తరబడి ఎదురు చూశారు. కానీ అక్కడి వారెవ్వరూ ఆయన్ను పట్టించుకోలేదు. ఆయన ఉనికిని కనీస మాత్రంగా కూడా గుర్తించిన పాపాన పోలేదు. వారు పిలిస్తేనే వెళ్లాలన్న బేషజంతో బిగుసుకొని కూర్చుంటే లాభం లేదని గ్రహించి, తనకు తానుగా ఢిల్లీ వెళ్లాడు జగన్. కానీ అప్పుడు కూడా అధిష్టానం చూసీ చూడనట్లు వుండిపోయింది. సోనియాగాంధీ దర్శన భాగ్యం దుర్లభమని తేలిపోయింది. వీరప్ప మొయిలీ ఒక్కడే జగన్‌కు కొంత వూరట కల్గించాడు. తన ఇంటికి పిలిచి, ముప్పావు గంట సేపు ఓదార్పు వచనాలు పలికాడు. అయితే ఇంతలో ఏమైందో తెలియదు కానీ, జగన్‌ను తాను పిలవలేదని, మర్యాద పూర్వకంగా కలుస్తానని విజ్ఞప్తి చేస్తే సరే అన్నానని వివరణ ఇచ్చుకొన్నాడు. జగన్ ఢిల్లీ పర్యటన తన ప్రమేయంతో జరగలేదని, ఆయనంతట ఆయనే వచ్చాడని సంజాయిషీ చెప్పుకొన్నాడు. మన రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలకు వీరప్ప మొయిలీ పర్యవేక్షకుడు. సోనియాగాంధీతో నేరుగా ఆంధ్ర విషయాలు మాట్లాడే చనువు వున్నవాడు. ఆయన అటువంటి సంజాయిషీలు చెప్పుకోవాల్సి రావడం అంటే, ఢిల్లీలో జగన్ పట్ల ఏ కొంచెం కూడా సానుకూలత లేదని అర్థం.




మహారాష్ట్ర, హర్యానాలలో కాంగ్రెస్ ఓటమికి గురైతే, ఎఐసిసికి ఆంధ్ర రాష్ట్రం కీలకమౌతుందని; విధిలేని పరిస్థితిలోనైనా అందుకోసం తనను ఆదరించక తప్పదనే అభిప్రాయంలో వుండినాడు జగన్. ఆ రెండు రాష్ట్రాలు చేజారితే నిధుల కోసమైనా తనను దగ్గర తీస్తారని ఆశించాడు. కానీ ఆ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ అనుకూలంగా వచ్చాయి. సోనియా ప్రతిష్టను ఆకాశం ఎత్తుకు పెంచాయి. ఈ వార్త వ్రాసే సమయానికి మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని ఆధిక్యత లభించింది. గత శాసనసభ కంటే అధిక స్థానాలు దక్కించుకొనేట్లుగా వున్నాయి ఫలితాలు. శివసేన కూటమి చతికిలపడింది. రాజఠాకరే కూడా నామ మాత్రావశిష్టుడై పోయాడు. మహారాష్ట్రలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రావడం ఇది వరసగా మూడోసారి.



ఈ ఫలితాల వల్ల, దేశంలో ఎక్కడైనా సోనియా, రాహుల్, మన్మోహన్ సింగ్‌ల వల్లనే కాంగ్రెస్ విజయం సాధిస్తుంది తప్ప రాష్ట్రస్థాయి నేతల ప్రభావం వల్ల కాదని ఢిల్లీ పెద్దలు చేస్తున్న వాదనకు బలం చేకూరింది. ప్రజలు సోనియాను చూసి ఓట్లు వేస్తారే తప్ప వైఎస్‌ను మెచ్చి కాదని వారు మొదట నుంచి వాదిస్తూ వచ్చారు. వైఎస్ వల్లనే ఆంధ్రలో మళ్లీ అధికారం దక్కిందన్న ప్రచారం ఢిల్లీలోని వారెవ్వరికీ రుచించలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రాభవం తన తండ్రి పెట్టిన భిక్ష కాబట్టి, ముఖ్యమంత్రిత్వం తన వారసత్వ హక్కు అన్న ధోరణిలో వుండిన జగన్‌కు, ఆయన అనుచరులకు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు అశనిపాతంగా మారాయి.

అధిష్టానంతో కాళ్ల బేరానికి వెళ్లడం తప్ప ఇక తాను చేయగల్గింది ఏదీ లేదని జగన్‌కు బాగా అర్థమైపోయింది. కాదు, కూడదని పోరాటానికి దిగితే, అసలుకే మోసం తప్పదని ఆయన తెలుసుకొన్నాడు. ఇప్పటికే చిదంబరం, ప్రణబ్ ముఖర్జీ వంటి అగ్రనేతలు జగన్ అక్రమ ఆస్తులు, ఆర్జనల మీద వివిధ సంస్థల ద్వారా నివేదికలు తెప్పించినట్లు సమాచారం. ఓబులాపురం ఇనుప ఖనిజం గనుల నుంచి, బెంగుళూరులో 500కోట్ల రూపాయలతో నిర్మించిన రాజప్రసాదం వంటి ఇంటి వరకు మొత్తం సమాచారం సాక్ష్యాధారాలతో వారి వద్ద వుంది. వారితో పేచీ అంటే, ఆ వ్యాపారాలన్నిటినీ రిస్క్‌లో పెట్టుకోవడం తప్ప వేరు కాదు. కేంద్ర ప్రభుత్వం కన్నెర్రచేస్తే ఎంత పెద్ద పారిశ్రామికుడైనా మలమల మాడిపోవడం ఖాయం. జగన్ వ్యాపారాలన్నీ రాత్రికి రాత్రి పుట్టుకొని వచ్చిన అక్రమ ఆస్తులు కాబట్టి, మరింత ప్రమాదం. రాదని తెలిసిన ముఖ్యమంత్రిత్వానికి ప్రాకులాడడం కంటే, చేతిలో వున్న వేల కోట్ల రూపాయల ఆస్తులను భద్రం చేసుకోవడమే ఉత్తమమన్న జ్ఞానోదయం కలిగింది జగన్‌లో.

ఎమ్మెల్యేలందరూ తనతో వున్నారన్న ధీమాతో గత యాభై రోజులుగా తన శిబిరం నడిపిన ధిక్కారధోరణి నుంచి గౌరవప్రదంగా సర్దుబాటు పర్వం ప్రారంభించడం ఎట్లా అన్నదే జగన్ ముందు మిగిలి వున్న ప్రశ్న. కాళ్లబేరానికి వచ్చాదన్న ప్రచారం జరిగితే, తనతో వున్న ఎమ్మెల్యేలలో అధిక సంఖ్యాకులు చల్లగా జారుకోవడం ఖాయం. ముఖ్యమంత్రి పదవి బదులు కేంద్రంలో మంత్రి పదవి ఇస్తారనే అభిప్రాయం కూడా తమకు తాము వూహించుకొన్నదే తప్ప

కొరవ 14వ పేజీలో

# దారి తప్పవద్దు

కొత్త ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య పరిపాలన నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి వుంది. సరైనదారి ఎంచుకోవడంలో తటపటాయింపుకు లోనౌతున్నది. యాభై ఏళ్ల సుదీర్ఘ అనుభవం కల్గిన రాజకీయవేత్త ఆయన. పరిపాలనలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలు, వాటిని ఎదుర్కోవడానికి అనుసరించే పద్ధతులు వంటి వాటిని అవపోసన పట్టిన నిష్ణాతుడు. దశాబ్దాలపాటు మంత్రిగా పనిచేసినా, తనను ఎవరూ వేలెత్తి చూపించే పరిస్థితి రాకుండా జాగ్రత్తపడిన నైపుణ్యం కల్గినవాడు. ఇంత వరకు రోశయ్య మీద ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదు. ఆ సచ్చరిత్ర, వివాదరాహిత్య పోకడ, పాల నానుభవం, రాజకీయ అవగాహన, సంయమనం పాటించే నిగ్రహ వైఖరి కల్గినవాడు కాబట్టే అధిష్టానం ఆయన్ను కొత్త ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. రాష్ట్ర కాంగ్రెస్‌లో ఏ ఒక్కరు కూడా ఆయన్ను ముఖ్య మంత్రిగా ఎంపిక చేయడం పట్ల వ్యతిరేకత వ్యక్తం చేయలేదు. జగన్ కావాలని కోరేవారు వందల సంఖ్యలో వున్నప్పటికీ, రోశయ్య వద్దని చెప్పేవారు ఒక్కరూ లేరన్న నిజాన్ని ఇక్కడ గమనించి తీరాలి.

అయితే ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. తన ఐదేళ్ల పాలనలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అటు ప్రజాకర్షణను, ఇటు స్వంత లాభాన్ని మేళవించి నేర్పుగా నెట్టుకవచ్చారు. ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, పావలా వడ్డీ, ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి అసంఖ్యాకమైన పథకాల ద్వారా ప్రజల మెప్పు పొందుతూనే, మరొకప్రక్క కాంట్రాక్ట్ పనులలో, భూ పంపకాలలో, ప్రభుత్వ నిధుల తరలింపులో ఆఫ్రికా దేశాల నేతలు సైతం నివ్వెరపోయే రీతిలో అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డాడు. 2004 ఎన్నికల నాటికి తన స్వంత ఇంటిని అమ్ముకోక తప్పని ఆర్థిక సమస్యలలో వుండిన వైఎస్, 2009 ఎన్నిక లొచ్చేసరికి అంబానీలను తలదన్నే శ్రీమంతుడిగా ఎదిగాడు. ప్రతిపక్షాలు, పత్రికలను ఏ మాత్రం లెక్క చేయలేదు. విమర్శలు పట్టించుకోలేదు. కోర్టు తీర్పులను తృణీకరించాడు. తన వాడైతే చాలు, ఏ చట్టమూ, ఏ నిబంధనా చూడకుండా సహాయం చేసేవాడు. అది ఎసిబి కేసు నుంచి విముక్తి అయినా, వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తి దుర్వినియోగమైనా ఒకటే తీరు.

ఆయన హఠాత్ మరణంతో, ఆయన ద్వారా లబ్ది పొందాలనుకొన్న పారిశ్రామికులు, వ్యాపారులు, కాంట్రాక్టర్లు మధ్యలో ఆగిపోయిన తమ పనులను చేసి పెట్టమని రోశయ్య మీద ఒత్తిడి తెస్తున్నారు. వైఎస్ వదలి వెళ్లిన ఫైళ్ల మీద సంతకం పెట్టించాలని చూస్తున్నారు. ఈ అక్రమాల పరంపరలో ఒక భాగం, ప్రైవేటు విద్యుత్ సంస్థలు 20 శాతం విద్యుత్‌ను తమ ఇష్టం వచ్చిన వారికి అమ్ముకొనేందుకు స్వేచ్ఛ కలిపించే ఉత్తర్వు. విద్యుత్ కొరతతో సతమతమౌతున్న రాష్ట్రం, ఇటువంటి నిర్ణయం తీసుకోవడం, అందుకు కారణం ఏదైనప్పటికీ సముచితం కాదు. ఆ విద్యుత్ ప్రాజెక్టుల యాజమాన్యాలకు వైఎస్ వాగ్దానం చేసి వుండినాడు కాబట్టి, తాను ఫైల్ మీద సంతకం చేశానని చెప్తున్నాడు రోశయ్య. ఆయన నుంచి అటువంటి సమాధానం వినవలసి రావడం దురదృష్టకరం. అంతకంటే దారుణం, ఈ అక్రమాన్ని విద్యుత్ రెగ్యులేటరీ అథారిటీ ఎదుట నిలదీసిన ఒక రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగికి పెన్షన్ నిలిపి వేస్తామని బెదరించడం. ప్రభుత్వం తప్పుచేస్తే, చట్టబద్ధమైన సంస్థల ఎదుట, ప్రజాస్వామ్యయుతంగా ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ వుంది. ఆ హక్కును బెదరింపులతో హరించాలని చూడడం రోశయ్య సర్కారు చేయదగిన పని కాదు.

జమీన్‌రైతు

## జనవాణి

### తిరుమలలో రాజకీయ జోక్యం

ముస్లింల పవిత్ర స్థానాల జోలికి వెళ్తే వారు కత్తులు తీసుకొని వస్తారు. క్రైస్తవుల చర్చిల జోలికి వెళ్తే వారు ఊరుకోరు. కాని హిందువుల పవిత్ర ఆలయాలను దోచుకతింటుంటే వారిని శూలాలతో పొడిచేవారే లేకుండాపోయారు. దీనికి ఉదాహరణగా తిరుమల తిరుపతి దేవస్థానాన్ని పేర్కొనవచ్చు. ఈ దేవస్థానంలో రాజకీయ జోక్యం పెరిగిపోయింది. పాలక వర్గ సమావేశంలో సభ్యులు బాహాబాహికి దిగుతున్నారు. ఒక పథకం ప్రకారం స్వామివారి ఆస్తులను కైంకర్యం చేస్తున్నారు. ఆర్జిత సేవల టిక్కెట్ల ధరలు మళ్లీ పెంచేశారు. ఏడుకొండలస్వామి సహనశీలి. ఆయన ఆస్తులు తిన్నవాళ్లు ఎప్పటికైనా తగిన మూల్యం చెల్లించక తప్పదు.

వాస్తురామచంద్ర, నెల్లూరు

### విక్రమ సింహపురి కిసాన్ సెజ్!

ఐదవ నెంబర్ జాతీయరహదారిపై కొడవలూరు మండలం రేగడి చెలిక దగ్గర ఎట్టకేలకు కిసాన్‌సెజ్ రూపు దిద్దుకోవడం జిల్లా ప్రగతిలో శుభపరిణామం. పదేళ్లలో పూర్తికానున్న ఈ బృహత్ అగ్రో – ఇండస్ట్రియల్ సముదాయానికి విక్రమసింహపురి ఇఫ్‌కో కిసాన్‌సెజ్ అని నామకరణం చేయడం సముచితంగా వుంటుంది. అంతేకాదు జిల్లా రైతాంగానికి ఆశాదీపంగా నిలిచే ఈ భారీ ప్రాజెక్ట్‌లోని వివిధ విభాగాలకు ఎసి సుబ్బారెడ్డి, పెళ్లకూరు రామచంద్రారెడ్డి, సుందరయ్య, జి.సి.కొండయ్య, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి వంటి విశిష్ట నాయకుల పేర్లు పెట్టడానికి జిల్లా ప్రజానీకం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

ఎం.రామమూర్తి, విశాఖపట్నం

### రాజశేఖర్‌రెడ్డిని మరవలేరు!

దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు అంత సులభంగా మరవలేరు. ఆయన బాధ్యతలు స్వీకరించాక పరిశ్రమలు పెట్టి ఉపాధి రంగాన్ని పెంపొందించారు. రైతు మిత్రునిగా, వుద్యోగమిత్రునిగా, దేశభక్తునిగా, ప్రాణ వైద్యునిగా, శాసనమండలి పునరుద్ధారకునిగా, పర్యావరణ పరిరక్షకునిగా, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కారకునిగా, పంట కాల్వల పరిరక్షకునిగా, గ్యాస్‌ధర తగ్గింపుదారునిగా, అన్నిటికీ మించి తెలుగు

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

27-10-1939
పేజీలు : 12 వెల: అణా

### కాంగ్రెసుకు అఖండ మెజారిటీ

ఈనెలలో జరిగిన జిల్లాబోర్డు ఎన్నికలలో కాంగ్రెసు వారు అఖండ విజయం పొందారు. ప్రతి జిల్లా బోర్డుకు మొత్తం సీట్లు 52, అందులో కాంగ్రెసు వారికి నెల్లూర్లో 49, తంజావూరులో 49, రామనాడులో 49, కోయంబత్తూరు 42, తూర్పు గోదావరి 42, సేలముజిల్లాలో 38 స్థానములు లభించాయి.

### నెల్లూరు దసరా కొట్లాటలు

23తేది ఒక మంగలిని మహమ్మదీయులు కత్తితో పొడిచినారు. 25తేది ఉదయం ఒక మహమ్మదీయుని శవం పెన్నా నీటిలో కనుగొనబడింది.

23తేదిన హిందువులు 61, మహమ్మదీయులు 34, 24తేదీన 41 మహమ్మదీయులు అరెస్ట్ చేయబడ్డారు.

నెల్లూరు పోలీసు వారి సిద్ధాంతం 22తేదీన పులివేషాలు కబాడిపాళెం నుంచి గుంపులో వూరేగుతూ రాలేదని, ఎవరికిన్నీ కనపడక ఎటులనో శిఖరంవారి వీధి దగ్గరకు వచ్చి చేరారని పోలీసు అధికారులు డిఐజి గారికి తెలిపిరనియు, ఈ సిద్ధాంతం సత్యదూరమైనదనియు, గుంపుతోనే కబాడిపాళెం నుంచి బజారు గుండా నడుచుచూనే శిఖరం వారి వీధి సమీపించిరని 26తేదిన డిఐజి గారిని దర్శించిన వెన్నెలగంటి రాఘవయ్య, ఆనం వెంకటరెడ్డి, కాసుఖేల రామారావు, రాచవూటి రామలింగంశ్రేష్టిగారలు తెలిపినారనియు తెలియుచున్నది.

### నెల్లూరులో శాంతి

25తేది నుండియు ఏలాటి గలాటాలు జరగలేదు. పోలీసు బందోబస్తు చక్కగా జరుగుచున్నది. గుంటూరు నుంచి రిజర్వు పోలీసువారు కూడా వచ్చి యున్నారు. టౌన్‌లో శాంతి యేర్పడియున్నది. సినిమాలు ఈ రోజు నుండి మరల ఆరంభించబడుచున్నాయి. అధికారులు వర్తకులచే అంగళ్లు తెరిపించుటకు ప్రయత్నించుచున్నారు.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

23-10-1959
పేజీలు: 12 వెల: 0-3-0

### ఉత్తర తాలూకాలో భూకంపం

నెల్లూరు జిల్లా ఉత్తర తాలూకాలలో – దర్శి మొదలు కోవూరు వరకు 12తేది రాత్రి పెద్ద శబ్దంతో భూకంపం సంభవించినట్లు మాకు చేరిన వార్తలను బట్టి తెలుస్తున్నది. అయితే ఎచ్చటా ఏ విధమైన నష్టమూలేదు. ఇటు ఒంగోలు, అటు మార్కాపురం మధ్య వున్న దర్శితాలుకా గ్రామాలలో ఆనాటి రాత్రి కొద్ది సెకండ్ల సేపు భూమి కంపించినట్లు శాసనసభ్యుడు రమణారెడ్డి, మహానంద తెల్పుతున్నారు.

కావలి పట్టణంలో ఒంటిగంటప్పుడు పెద్ద శబ్దంతో భూమి కంపించిందని, ప్రజలు భయపడ్డారని ఒక విలేఖరి తెల్పుతున్నాడు.

రాళ్లపాడు ప్రాజెక్టు సమీపంలోని సాయిపేటలో 12తేది రాత్రి 11.30 గంటలకు పెద్ద శబ్దంతో భూమి కంపించడం ప్రారంభమై, కొన్ని నిముషాలు వుండినదని, తాము కూర్చొని వుండిన గోడ గూడా వూగిందని, ఎన్నిక హడావుడిలో అందరు మేలుకొని వున్నందున వెంటనే భూకంపంగా గమనించామని పెరుమాళ్ల నాయుడు గారు తెల్పుతున్నారు.

నెల్లూరుకు దక్షిణంగా ఈ కంపం వున్నట్లు లేదు.

### కమ్యూనిస్టులకు ఘోర పరాజయాలు

కోవూరు తాలూకాలో లెనిన్ గ్రాడులు, స్టాలిన్ గ్రాడులనుకున్న గ్రామాలన్నిటిలో కమ్యూనిస్టులకు మామూలు ఓటమిగాదు. ఘోరపరాజయం సంభవిస్తున్నది. ఎన్నో సంవత్సరాలు గట్టి పునాదులతో నిర్మించుకొన్న ఎర్రకోటలన్నీ ఒక్కొక్కటి కూలిపోతున్నవి. కడకు కోవూరు కమ్యూనిస్టు శాసనసభ్యుడు బస్వారెడ్డి శంకరయ్య స్వగ్రామమైన ఇందుపూరులో వీరికి ఒకే ఒక్క స్థానమొచ్చిందంటే, పంచాయితీ ఎన్నికలలో వీరికి కలిగిన పరాభవానికి వేరే నిదర్శనం అక్కరలేదు. తలమంచి, విడవలూరు, ఊటుకూరు వగైరా అనేక ముఖ్యకేంద్రాలలో వీరికి ఓటమి సంభవించింది. లేగుంటపాడులో పరాజయం పొందారు. యల్లాయపాళెంలో అసలు పోటి ప్రసక్తే లేదు.

# బియ్యం బొక్కేస్తున్న పందికొక్కులు




## గోడౌన్ల నుంచి డీలర్ల వరకు అదే తంతు

పౌరసరఫరాల శాఖ నేతృత్వంలో నడిచే గోడౌన్ల నుంచి, డీలర్ల వరకు రెండు రూపాయల కిలో బియ్యాన్ని తలా కొంత బొక్కేస్తుండడంతో అంతిమంగా వీటిని అందుకోవాల్సిన వారు నష్టపోవాల్సి వస్తున్నది. గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న ఈ అవినీతిపర్వంపై దృష్టి పెడితే పలు ఆసక్తికరమైన విషయాలు తెలిసాయి. కాకుటూరులోని ఎఫ్‌సిఐ గోడౌన్ల నుంచి ప్రతినెల జిల్లాలోని పౌరసరఫరాలశాఖ నేతృత్వంలో నడిచే స్టాక్ పాయింట్లకు బియ్యం బస్తాలను తరలిస్తారు. ఎఫ్‌సిఐ గోడౌన్లలోని సిబ్బంది బస్తాలను లారీలకు ఎత్తే సమయంలో ఒక పథకం ప్రకారం లారీ లోడుకు 200కిలోలను బస్తాలకు రంధ్రాలు వేసి నొక్కేస్తున్నారు. నెలసరి లెక్కిస్తే ఈ బియ్యం 40 టన్నుల వరకుంటుంది. ఈ బియ్యాన్ని ఇతర బస్తాలలో ప్యాక్ చేసి ఇక్కడి సిబ్బంది బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొంటున్నారు. బియ్యం తక్కువగా పౌరసరఫరాల స్టాక్ పాయింట్లకు వస్తున్నా ఇక్కడి డిటిలు ఎఫ్‌సిఐ అధికారులను ప్రశ్నించడం లేదు. తమ వాటాగా లారీ లోడుకు మరో 200 కిలోలు లాగేసి వెలితి బస్తాలను డీలర్లకు అంటగడుతున్నారు. బస్తాకు నాలుగు కిలోల బియ్యం తగ్గిపోయి వస్తుండడంతో డీలర్లు తెలివిగా కొంతమంది కార్డుదారులకే బియ్యం పంపిణీ చేస్తున్నారు. వాస్తవానికి నెలాఖరు వరకు బియ్యాన్ని రేషన్ డీలర్లు ఇవ్వాలి. కాని రెండు రోజులు మాత్రమే రేషన్ ఇచ్చి అయ్యిందనిపిస్తున్నారు. కొన్నిచోట్ల తప్పుడు తూకాలు తూస్తున్నారు. ప్రతిచోట డీలర్లు లంచాలిస్తుండడంతో రేషన్‌సరకుల పంపిణీపై అడిగే అధికారే లేకుండా పోయారు. ప్రతిష్టాకరమైన ఈ బియ్యం పథకంలో తెగమెక్కుతున్న పందికొక్కులపై చర్యలు తీసుకొంటే కిలో బియ్యం బహిరంగమార్కెట్‌లో 34 రూపాయలకు చేరుకున్న ఈ రోజుల్లో సామాన్యులకు మేలు చేసినవారవుతారు.

# రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు

## ............ కలెక్టర్ ఆదేశం



జిల్లా వ్యాప్తంగా అర్హతగల ప్రతి రైతుకు విధిగా పట్టాదారు పాసుపుస్తకాలు అందించేందుకు రెవిన్యూ యంత్రాంగం కసరత్తు ప్రారంభించనుంది. పట్టాదారు పాసు పుస్తకాలు అందించడంతోపాటు బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందేందుకు సహాయసహకారాలు అందించాలన్న సంకల్పంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అందుకొన్న జిల్లా కలెక్టర్ రెవిన్యూ అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు భూమికలిగి పట్టాదారు పాసు పుస్తకాలు పొందని రైతులకు ఈ ఆదేశాలతో త్వరితగతిన పాసు పుస్తకాలు పొందే అవకాశం కలుగుతుంది. పాసు పుస్తకాల పంపిణీకి రెవిన్యూ అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవడంతోపాటు సంబంధిత బ్యాంకు అధికారులు, వ్యవసాయశాఖ అధికారుల సమన్వయంతో సమావేశాలు నిర్వహించి రైతులకు అన్ని విధాల సహకరించాల్సి వుంటుంది. అలాగే భూమికి సంబంధించిన పట్టాలను పంపిణీ చేసే సమయంలో అడంగల్‌లో సర్వే నెంబర్లు, లబ్ధిదారుని పేరు, తదితర విషయాలను నిర్దేశించిన ప్రొఫార్మాలో పొందుపరచి రికార్డులను సక్రమంగా నిర్వహించాల్సి వుంటుంది. రైతులు సాగు చేస్తున్న భూములకు మైనర్ ఇరిగేషన్ చెరువుల వారీగా నివేదికలు రూపొందించాలి. రెవిన్యూపరంగా పేద ప్రజలకు అమలుచేస్తున్న కార్యక్రమాలు అందేవిధంగా చూడాలి. రెవిన్యూ రికవరి చట్టం క్రింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏదిఏమైనా పట్టాదారు పాసు పుస్తకాల కోసం రెవిన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ నుంచి రైతులకు విముక్తి కలగనుంది.

# సీజనల్ వ్యాధులతో సతమతం

## ప్రజలకు దేవుడేదిక్కు

సీజనల్ వ్యాధులు నగర ప్రజలను చుట్టుముడుతున్నాయి. పారిశుధ్యం అస్తవ్యస్తంగా వుండడం, నీరు కలుషితం అవుతుండడంతో పలువురు అనారోగ్యం పాలవుతున్నారు. ఆస్పత్రులు వ్యాధుల బారినపడిన వారితో కిటకిటలాడుతున్నాయి. విషజ్వరాలతో బాధపడుతున్న వారితో ఆస్పత్రుల లోని వార్డులన్నీ నిండి వుంటున్నాయి. మలేరియా, విరోచనాలు, వైరల్ జ్వరాలతో అల్లాడిపోతున్నారు ప్రజలు. ఇప్పటికే స్వైన్‌ఫ్లూ వ్యాధి వణికిస్తున్న సంగతి తెలిసిందే. దీనికితోడు జ్వరాలు, అంటువ్యాధులు, కామెర్లు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా పలు ప్రాంతాలలో మంచినీటి పైపుల్లో మురుగునీరు కలవడం, చెత్తాచెదారాలను తొలగించకపోవడంతో పారిశుధ్యం క్షీణించడంతో ప్రజలు రోగాలబారిన పడాల్సివస్తోంది. రామచంద్రారెడ్డి హాస్పిటల్, జయభారత్ తదితర ఆస్పత్రులన్నీ రోగులతో నిండివుండడం వ్యాధుల తీవ్రతను తెలియజేస్తున్నాయి. ప్రజల బాగోగులు పట్టించుకోవాల్సిన పాలకులు సొంత ప్రయోజనాలలో మునిగితేలుతూ ప్రజాసమస్యలు గాలికి వదిలేయడంతో నగరవాసులకు కష్టాలు తీర్చేవారే లేకుండాపోయారు.

# సుందర ముదనష్టపు రోడ్లు



## పాలకులకు పట్టదా?

పట్టణం నుంచి నగర హోదా సంతరించుకొన్నా సౌకర్యాలు, అభివృద్ధి విషయంలో మాత్రం ఎలాంటి మార్పు చోటుచేసు కోలేదనేందుకు నగరంలో రోడ్లను చూస్తే అర్థమవుతుంది. గుంటలు మిట్టలుగా మారిన రోడ్లపై ప్రయాణం నగరవాసులకు నరకాన్ని చూపెడుతోంది. ఎవరైనా మంత్రులు వస్తున్న సందర్భంలో రాత్రికిరాత్రి తాత్కాలికంగా రోడ్లపై గుంటలు పూడ్చడం మినహా రోడ్లకు దీర్ఘకాలం పనికి వచ్చేలా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో అధ్వాన్నంగా తయారైన రోడ్లపై ప్రయాణిస్తూ రకరకాల శారీరక సమస్యలను ఎదుర్కొంటున్నారు ప్రజలు. నడుం నొప్పులు, మెడనొప్పులతో అధిక శాతం మంది బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అలాగే వాహనాలు అదుపుతప్పి పడిపోతుండడంతో పలువురు గాయాలపాలవుతున్నారు. కరెంటు ఆఫీస్ సెంటర్, బొల్లినేని హాస్పిటల్, ఫత్తేఖాన్‌పేట, నెహ్రూవిగ్రహం, గాంధీబొమ్మల వద్ద రోడ్లు దెబ్బతిని వున్నా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలపై ప్రయాణించే వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

# రోడ్డుపై అడ్డంగా లారీలు

● జూబ్లీ హాస్పిటల్, బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లటం కష్టమే



నెల్లూరు మద్రాస్ బస్టాండ్ వద్ద గల జూబ్లీ ప్రసూతి వైద్యశాలకు వెళ్లే మార్గంలో ప్రతినిత్యం ట్రాఫిక్ జఠిలంగా మారుతోంది. రాత్రి పగలు తేడా లేకుండా కూరగాయల మార్కెట్‌కు వచ్చే వాహనాలను ఈ రోడ్డుపైనే అన్‌లోడ్ చేయను నిలిపేస్తున్నారు. దీంతో గతవారంలో పురిటి నొప్పులతో ఆస్పత్రికి బయలుదేరిన మహిళ దారిలేక ఆటోలోనే పండంటి బిడ్డను ప్రసవించాల్సి వచ్చింది. ఈ మధ్య కూరగాయల మార్కెట్‌లో కొత్తగా షాపులు కడుతుండడంతో లారీలను మార్కెట్‌లోనికి అనుమతించడం లేదు. దీంతో డ్రైవర్లు ఆస్పత్రి, రెడ్‌క్రాస్‌లకు వెళ్లే రోడ్డులోనే అన్‌లోడు చేసేవరకు ఆపేస్తున్నారు. రాత్రివేళల్లో పరిస్థితి మరీ ఘోరంగా వుంటుంది. మనిషి నడచివెళ్లను సైతం రోడ్డుపై స్థలం వుండడం లేదు. రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌కు అత్యవసరంగా రక్తం అవసరమై వెళ్లేవారి స్కూటర్లను కూడా మార్కెట్ రౌడీలు ఈ దారిలో వెళ్లనివ్వడం లేదు. ప్రసవ నొప్పులు వచ్చే మహిళల పరిస్థితి వర్ణనాతీతంగా వుంది. ట్రాఫిక్ పోలీసులు జోక్యం చేసుకొని ఇక్కడ సరకు అన్‌లోడ్‌కు వచ్చే లారీలను ఒకప్రక్క నిలబడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.



నాయుడుపేటలోని మేరి వృద్ధుల ఆశ్రమానికి పదివేల రూపాయల చెక్కును జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ద్వారా అందిస్తున్న నెల్లూరు హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీసు ఆర్గనైజేషన్ నిర్వాహకుడు టి.కృష్ణారెడ్డి. చిత్రంలో గుండె డాక్టర్ శ్రీనివాసరాజు, షుగర్ డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి వున్నారు.

● సాంఘిక సంక్షేమశాఖ

# డిడిపై నామమాత్రపు విచారణ!

**స్కాలర్ షిప్పులు, డిఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ, హాస్టళ్ల నుంచి నెలనెలా మామూళ్లు, నర్సు ట్రైనింగ్ కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను డిప్యూటీ డైరెక్టర్ సీతామహాలక్ష్మి మహాబాగా స్వాహా చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి.**




నెల్లూరులోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయం.

జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటి డైరెక్టర్ సీతామహాలక్ష్మిపై వచ్చిన అవినీతి ఆరోపణలు, నిధుల దుర్వినియోగం జరిగిన సంఘటనలపై ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులపై ఎట్టకేలకు స్పందన లభించింది. గత రెండు సంవత్సరాల నుంచి డిప్యూటి డైరెక్టర్ సీతామహాలక్ష్మిపై వచ్చిన ఫిర్యాదులపై ఆ శాఖ కమిషనర్ విచారణకు ఆదేశించారు. దీంతో కమిషనర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రశాంతికుమారి ఇటీవల నెల్లూరుకు వచ్చి విచారణ ప్రారంభించారు. స్కాలర్‌షిప్పుల మంజూరు, డిఎస్సీ అభ్యర్థులకు ఉచితశిక్షణ పేరుతో నిధుల దుర్వినియోగం, ఉద్యోగుల బదలీల్లో అక్రమాలు చోటుచేసుకోవడం, హాస్టళ్ల వార్డెన్ల నుంచి ప్రతి నెల మామూళ్లు వసూలు చేయడం, నర్సింగ్ కళాశాలల్లో బాలికలకు నర్సుట్రైనింగ్ కోసం ఖర్చు చేసిన నిధులు తదితర అంశాలపై సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటి డైరెక్టర్ అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ కోసం ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రశాంతికుమారిని నియమించడం జరిగింది.

## ఫిర్యాదు దారులను పిలిపించలేదు!

గతవారం జాయింట్ డైరెక్టర్ ప్రశాంతి కుమారి విచారణ జరిపేందుకు నెల్లూరుకు వచ్చారు. పూర్తి ఆధారాలతో డిప్యూటి డైరెక్టర్ సీతామహాలక్ష్మిపై ఫిర్యాదు చేసిన సంస్థలు, వ్యక్తులను విచారణకు హాజరు కావాలని ఎటువంటి నోటీసులు అందజేయక పోవడంపట్ల విచారణ అధికారిణిపై అనేక సందేహాలు, ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎవరైన అధికారి విధినిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదుచేస్తే విచారణ జరిపే సమయంలో ఫిర్యాదు చేసిన వారిని పిలిపించి వారి అభిప్రాయాలను తీసుకోవాల్సిన బాధ్యత విచారణాధికారిపై వుంటుంది. అయితే జాయింట్‌డైరెక్టర్ ప్రశాంతికుమారి చేపట్టిన విచారణ డిప్యూటి డైరెక్టర్‌కు అనుకూలంగా, ఏకపక్షంగా జరిగిపోయినట్లు కనిపిస్తుంది.

జిల్లాకు విచారణ నిమిత్తం వచ్చే విషయం ముందుగా సంబంధిత అధికారులకు సమాచారం అందినా కూడా బయటకు పొక్కనీయకుండా చివరివరకు చాలా గోప్యంగా వుంచారు కార్యాలయ సిబ్బంది. జాయింట్ డైరెక్టర్ నగరానికి వచ్చి మూడునక్షత్రాల హోటల్‌లో బసచేసి, అనంతరం నేరుగా డిప్యూటి డైరెక్టర్ కార్యాలయానికి వెళ్లి డిప్యూటి డైరెక్టర్ సీతామహాలక్ష్మిని తూతూమంత్రంగా నాలుగు ప్రశ్నలు అడిగి సాయంత్రానికి త్రీస్టార్ హోటల్‌కు చేరుకున్నారు. విచారణాధికారి వచ్చిన విషయం సాయంత్రం తెలుసుకొన్న ఫిర్యాదుదారుడు కె.చంద్రశేఖర్ నేరుగా జాయింట్ డైరెక్టర్ బస చేసిన త్రీస్టార్ హోటల్ వద్దకు వెళ్లి విచారణ గురించి తనకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు.

డిప్యూటి డైరెక్టర్‌ని సమాచారం అందించాలని తాను చెప్పినట్లు సమాధానం చెప్పి తప్పించుకునేందుకు ప్రయత్నించారు జాయింట్ డైరెక్టర్. రాష్ట్రస్థాయి అధికారులు అధికారిక పర్యటనకు జిల్లా కేంద్రానికి వచ్చినప్పుడు సంబంధితశాఖకు చెందిన అధికారులు బస ఇతరఏర్పాట్లు చేస్తుంటారు. ప్రభుత్వ అతిధిగృహంలో కాని, ప్రయివేటు అతిథి గృహంలోగాని, జిల్లాకు వచ్చిన అధికారులకు బస సదుపాయం కల్పించడం ఆనవాయితీ. త్రీస్టార్ హోటల్‌లో బస చేసిన జాయింట్ డైరెక్టర్ ప్రశాంతికుమారి ఇక్కడ చాలా తెలివిగా వ్యవహరించారు. తన పేరు మీదగాని, లేక సాంఘిక సంక్షేమశాఖ పేరు మీద రూమ్‌ను బుక్ చేసుకోలేదు. ప్రయివేటు విద్యాసంస్థలు, నర్సింగ్ స్కూల్స్ ప్రతినిధులే జాయింట్ డైరెక్టర్‌కు రూమ్ బుక్ చేయడం ఇతర సదుపాయాలు కల్పించడం తదితర ఏర్పాట్లు చేశారు.

### ఏకపక్షంగా విచారణ



సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ సీతా మహాలక్ష్మిపై వచ్చిన అవినీతి, ఆరోపణలపై ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రశాంతికుమారి ఏకపక్షంగా విచారణ జరిపారు. ఫిర్యాదుదారులకు ముందుగా విచారణ జరిగే తేది, సమయం గురించి సమాచారం అందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుంది. హాస్టల్స్, నర్సింగ్ కళాశాల రికార్డులను విచారణ కోసం వచ్చిన అధికారిణి తనిఖీలు చేయలేదు. కేవలం త్రీస్టార్ హోటల్‌కే పరిమితం అయ్యింది.

*కొప్పోలు చంద్రశేఖర్,*
*జిల్లా మాలమహానాడు అధ్యక్షులు*

### త్రీస్టార్ హోటల్‌లో విచారణ



సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటి డైరెక్టర్ సీతామహాలక్ష్మిపై త్రీస్టార్ హోటల్‌ల్లో విచారణ జరగడం శోచనీయం. ఫిర్యాదుదారులు లేకుండానే డిప్యూటిడైరెక్టర్‌పై ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రశాంతికుమారి ఏకపక్షంగా విచారణ జరపాల్సిన అవసరం ఏముంది? విచారణ జరిగిన తీరుపై ఆ శాఖ కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి ఫిర్యాదు చేస్తాం.

*జాన్ విజయం,*
*జిల్లా దళితసేన సభ్యులు, నెల్లూరు.*

దీనివల్ల 22 నర్సింగ్ స్కూల్స్, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు లబ్ధిచేకూరే విధంగా వ్యవహరించారన్న ఆరోపణలు కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. డిప్యూటి డైరెక్టర్ సీతామహాలక్ష్మిపై జాయింట్ డైరెక్టర్ ప్రశాంతికుమారి చేపట్టిన విచారణ అనేక విమర్శలు, ఆరోపణలకు దారి తీసింది. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం బహిరంగ విచారణ చేపట్టాల్సిందిపోయి, ఎసి రూములో కూర్చొని రహస్యంగా విచారణ చేపట్టడం ఏమిటని ఫిర్యాదు చేసినవారు బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. విచారణాధికారిగా నియమితులైన జాయింట్ డైరెక్టర్ ప్రశాంతికుమారి వ్యవహరించిన తీరుపై ఆ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటి డైరెక్టర్‌గా సీతామహాలక్ష్మి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆశాఖ మొత్తం అవినీతిమయంగా మారిపోయింది.

## బహిర్గతమైన సత్యం!

సంక్షేమ హాస్టళ్లు ఎంత సక్రమంగా పని చేస్తున్నాయో జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు పి.మధు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే పరసారత్నం తనిఖీలలో బహిర్గతమైన విషయం అందరికి తెలిసిందే. డిప్యూటి డైరెక్టర్ అక్రమ సంపాదన ప్రతి నెల 2 నుంచి 3 లక్షల వరకు వుంటుందన్న ప్రచారం సాగుతుంది. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 152 సంక్షేమ హాస్టళ్లు వున్నాయి. వీటిలో బాలికలకు 49, బాలురకు 103 హాస్టళ్లు ఏర్పాటు చేసి వున్నారు. ఈ హాస్టళ్లలో ప్రవేశం పొందిన మూడు నుంచి ఏడవ తరగతి చదివే విద్యార్థులకు 330 రూపాయలు, 8 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు 475 రూపాయలు ప్రతి నెల ప్రభుత్వం ఖర్చుచేస్తుంటుంది. ఈ మొత్తంలో కూడా అధికారులు, వార్డెన్లు కోత విధించి స్వాహా చేస్తుంటారు. హాస్టల్స్ పని తీరును పర్యవేక్షించేందుకు జిల్లాలో 10 మంది సహాయ సంక్షేమశాఖాధికారులు వున్నారు. వీరు నిత్యం హాస్టళ్ల పని తీరును మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాల్సి వుంటుంది. అయితే వీరు కేవలం ప్రతి నెల వార్డెన్ల నుంచి మామూళ్లు వసూలు చేసుకొనే కార్యక్రమానికే అధిక సమయం కేటాయిస్తూ హాస్టళ్ల పర్యవేక్షణ గురించి పట్టించుకోవడం మానేశారు.

## డిడికి కులసంఘాల మద్దతు!

సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటి డైరెక్టర్ సీతామహాలక్ష్మికి అనుకూలంగా కొన్ని బి.సి సంఘాలు రంగంలోకి దిగాయి. ఈమెపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రశాంతికుమారి విచారణకు వచ్చిన సందర్భంగా యాదవ సంఘం నాయకులు డిప్యూటి డైరెక్టర్ నిజాయితీగా విధులు నిర్వహిస్తున్నారంటూ విచారణాధికారికి వినతి పత్రం ఇవ్వడం విస్మయం కల్గిస్తుంది. ప్రభుత్వపరంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సిన అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడితే ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడం సహజం. అయితే ఎక్కడ తమపై ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందోనని భయపడి డిప్యూటి డైరెక్టర్ సీతామహాలక్ష్మి తమ కుల సంఘాల నాయకుల ద్వారా విచారణాధికారికి తనకు అనుకూలంగా వినతి పత్రాన్ని ఇప్పించుకోవడంలో విజయం సాధించింది. ఇంతే కాకుండా నిజాయితీపరురాలని పత్రికా ప్రకటన కూడా జారీ చేయించింది. ఇందులో కుల సంఘాలు ప్రవేశించి వ్యక్తిగత కక్షలతోనే డిప్యూటి డైరెక్టర్ పై కొందరు గిట్టనివారు ఆరోపణలు చేస్తున్నారని ప్రకటించడం విశేషం. విచారణ కోసం వచ్చిన ఆ అధికారిణిని సైతం డిప్యూటీ డైరెక్టర్ సీతామహాలక్ష్మి ముడుపులు చెల్లించి తన దారికి తెచ్చుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# శంకుస్థాపనలతో సరి!

వెంకటగిరిలో పేరొందిన విశ్వోదయ విద్యాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపనలకే పరిమితం అయ్యాయి. విశ్వోదయ విద్యా సంస్థల సముదాయాన్ని మినీ విశ్వవిద్యాలయం స్థాయిలో తీర్చిదిద్దేందుకు నిర్వాహకులు ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేత శంకుస్థాపన చేయించారు. విశ్వోదయ స్థలాలను అమ్మకుండానే భవనాలు నిర్మిస్తామని రాజశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇది జరిగి ఏడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క నిర్మాణం ప్రారంభంకాలేదు. గతంలోనూ మినీ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఆలోచన చేసిన మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి క్రాస్‌రోడ్డు సమీపంలో వంద ఎకరాలు కేటాయించారు. 1992లో శిలాఫలకం వేశారు కాని ఈ నిర్మాణం మొదలు కాలేదు. అటవీశాఖ అనుమతులు ఆలస్యం కావడంతో మరికొంత ఆలస్యం అయింది. ప్రస్తుతం విశ్వోదయ స్థలాల విక్రయాలపై స్థానికులు ఆందోళన చేయడం, కోర్టును ఆశ్రయించడంతో ఇందులో 54ఎకరాలకు అటవీశాఖ క్లియరెన్సునిచ్చింది. వైఎస్ శంకుస్థాపన చేసినా నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో కళాశాల ఎదుగుబొదుగు లేకుండా పోయింది. ప్రస్తుతపు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అయినా నిర్మాణాలు జరిగేలా చూడాల్సి వుంది.

**వెంకటగిరిలో మినీ విశ్వవిద్యాలయానికి గ్రహణం**




నెల్లూరు వాసవీ క్లబ్ వనిత తరఫున కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలోని వరద బాధితులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న క్లబ్ కార్యదర్శి జమిలి శిరీష.

## రైతులకు 900 కోట్ల రుణాలు

జిల్లా రైతాంగానికి ఈ ఏడాది రబీసీజన్‌లో 900కోట్ల వ్యవసాయ రుణాలను అందజేస్తున్నట్లు లీడ్‌బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు తెలియజేశారు. కోవూరులో జరిగిన జాయింట్ మండలస్థాయి బ్యాంకర్స్ కమిటి సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని ఈ రుణాలు అందజేస్తున్నట్లు వివరించారు. పట్టాదారు పాసు పుస్తకాలు లేని రైతులకు సైతం ఈ రుణాలు ఇస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ గృహాలకు సంబంధించి ఎటువంటి ఆటంకం కలుగకుండా నిధుల కేటాయింపుకు ప్రత్యేకచర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. బ్యాంకర్లు ఆ దిశగా సరైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిఆర్‌డిఏ పిడి విజయచందర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలందించాలన్నారు.

## మాజీసైనికుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు

మాజీ సైనికుల పిల్లలకు ఉన్నత విద్యకోసం ప్రధానమంత్రి స్కాలర్‌షిప్ పథకం క్రింద నిధులు కేటాయించారు. ఇంజనీరింగ్, మెడికల్, ఎంబిఏ, ఎంసిఏ తదితర కోర్సులలో చేరే మాజీ సైనికుల పిల్లలకు 2009-10 విద్యాసంవత్సరానికి ఈ నిధులు కేటాయించారని జిల్లా సైనికసంక్షేమాధికారి బ్రహ్మానందం తెలిపారు. దీని క్రింద అమ్మాయిలకు చదువుకోసం ఏడాదికి 18వేల రూపాయలు, అబ్బాయిలకు 15వేలు అందజేస్తారట. ఇంటర్మీడియట్‌లో 60శాతం మార్కులు పొందిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, దరఖాస్తులను డిజిఆర్ ఇండియా డాట్ కామ్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకొని నవంబర్ 11లోగా అందజేయాలన్నారు.




జననం : 17-11-1934
మరణం : 30-10-1999

సంస్మరణ

మా అభివృద్ధికి కారకులు, మమ్ము ఎంతో ఉన్నతిలో నిలిపిన మహామనిషి
ఏనుగ చంద్రశేఖరరెడ్డి గారు
స్వర్గస్థులై 30-10-2009 తేదికి పది సంవత్సరాలు నిండుతాయి.

10వ వర్థంతి

సందర్భంలో వారిని సంస్మరిస్తూ భగవంతుడు ఆయన ఆత్మకు చిరశాంతిని కలుగజేయాలని శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య : ఏనుగ సుజాతమ్మ

కుమారులు - కోడళ్ళు
ఏనుగ మురళీమోహన్‌రెడ్డి - కల్పన
ఏనుగ అశోక్‌రెడ్డి - ఉషాలక్ష్మి

కుమార్తె - అల్లుడు
పద్మలత - పల్లంరెడ్డి రామలింగారెడ్డి

మనుమలు - మనుమరాండ్రు : రోషన్, రాహుల్, వినీల్, సౌమ్య, పూజిత, అనూష


# కావలిలో స్టేడియం ఎప్పుడు?

అంగట్లో అన్ని వున్నా అల్లుడి నోట్లో శని అన్నచందంగా వుంది కావలిలో స్టేడియం నిర్మాణం. పట్టణంలో స్టేడియం నిర్మాణానికి ఏడాది క్రిందట 10లక్షల రూపాయలు నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. 2001వ సంవత్సరంలో ఎమ్మెల్యేగా వున్న వంటేరు వేణుగోపాలరెడ్డి చొరవతో స్టేడియం నిర్మాణానికి అనుమతి లభించింది. అప్పటి హోంశాఖ మంత్రి దేవేందర్‌గౌడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఏడు సంవత్సరాలపాటు శిలాఫలకానికి మాత్రమే పరిమితమైన నిర్మాణ పనులకు ఏడాది క్రిందట నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఈ నిధులు విడుదల చేసినా స్థానిక పంచాయితీరాజ్ అధికారులు ప్రతిపాదనలు పంపని కారణంగా నిధులు వినియోగానికి నోచుకోలేదు. స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం విడుదల చేసిన నిధులేకాక ప్రముఖ వైద్యులు లక్ష్మీనరసారెడ్డి వంటి ప్రముఖులు ఎందరో విరాళాలు అందించేందుకు ముందుకు వస్తున్నా స్టేడియం నిర్మాణానికి అధికారులు తగినశ్రద్ధ తీసుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా వుంది.

**నిధులు మంజూరైనా ప్రతిపాదనలు తయారు కాలేదు**

గూడూరులో

## మూతబడిన సినిమాహాళ్లు!

పైరసీ సిడిల దెబ్బకు సినిమాహాళ్లు మూతవేసుకోవాల్సిన పరిస్థితులు గూడూరు పట్టణంలో తలెత్తుతున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి డివిడిల సహకారంతో సినిమా విడుదలైన మరుక్షణం పైరసీ సిడిలు మార్కెట్‌లోకి విడుదల అవుతుండడంతో ప్రేక్షకులు వాటిని కొని ఇంటివద్దే సినిమా చూస్తుండడంతో సినిమా హాళ్లకు వచ్చేవారి సంఖ్య నానాటికి తగ్గిపోతున్నది. లక్షకుపైగా జనాభా వున్న పట్టణంలో గతంలో ఒక వెలుగు వెలిగిన థియేటర్లు మెల్లమెల్లగా మూతపడుతున్నాయి. సీతారామాంజనేయ టాకీస్ ఐదేళ్ల క్రిందటే మూతపడింది. వనజాక్రిష్ణ సినిమా హాలును కొంతకాలం కళ్యాణమండపంగా మార్చారు. కొద్దికాలానికి దానిని కూడా అపార్టుమెంట్‌గా మార్చి వేశారు. ఇటీవల జియస్‌రాయలు థియేటర్‌ను మూసివేశారు. దీనిని ఇప్పుడు కళ్యాణమండపంగా మార్చారు. వినోదం కోసం సినిమాహాళ్లకు వెళ్లేవారికి నిరాశే ఎదురౌతుంది.

**పైరసీ సిడిలే కారణం**

## త్రాగునీరు కలుషితం

మర్రిపాడు మండలంలో పలు గ్రామాల్లో త్రాగునీరు కలుషితం అవుతుండడంతో పలువురు వ్యాధిగ్రస్తులవుతున్నారు. పడమటి నాయుడుపల్లెలో త్రాగునీరు కలుషితం కావడంతో గ్రామస్తులు ఆస్పత్రులపాలయ్యారు. ట్యాంకు నుంచి గ్రామంలోకి నీటి సరఫరా జరిగే పైపుల్లో లీకేజి కారణంగా కలుషితనీరు చేరుతున్నదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. వాల్వుల లీకేజిని అరికట్టేందుకు ఏర్పాటుచేసిన తొట్టిల్లో చెత్తచెదారం చేరడం, నీరు పాచిపట్టి వుండడంతోపాటు పురుగులు వుంటున్నాయి. ఆ నీరు పైపులైన్లలోకి రావడం వలన త్రాగునీటిలో మురుగునీరు కలసి వస్తుండడంతో గత్యంతరం లేక దాహార్తిని తీర్చుకొనేందుకు ఆ నీటినే త్రాగాల్సివస్తోందని స్థానికులు వాపోతున్నారు. దీంతో అనారోగ్యానికి గురై ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తున్నదని చెప్తున్నారు. కలుషిత నీటి గురించి మండల అధికార్లకు పలుమార్లు విన్నవించుకొన్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు.

**అల్లాడుతున్న పడమటినాయుడు పల్లెవాసులు**

## నీళ్లు నమిలిన రఘువీరా!



జగన్‌ను గనక ముఖ్యమంత్రి చేయని పక్షంలో జగన్ ప్రతిపాదించే రఘువీరా ముఖ్యమంత్రి అవుతారంటూ సాక్షి దినపత్రికలో వార్త రావడం 'రఘువీరా'కు ప్రాణసంకటంగా మారింది. సచివాలయంలో చుట్టుముట్టి మీడియా ప్రతినిధులు ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించేసరికి రఘువీరా నీళ్లు నమిలాడు. ఇటువంటి ప్రచారం వల్ల ముఖ్యమంత్రి పదవేమో కానీ ప్రస్తుతం వున్న మంత్రి పదవి కూడా ఊడిపోయే ప్రమాదం వుందంటూ రఘువీరా వాపోతున్నాడు. అందుకే తమాయించుకొని 'రోశయ్య' తర్వాత జగన్ ముఖ్యమంత్రి అవుతారంటూ ప్రకటించి గండం నుంచి బయటపడ్డాడు.

## రా... రమ్మని



జగన్‌కు ఢిల్లీ పిలుపు అందని ద్రాక్షలా తయారైంది. మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిశాక అధిష్టానం నుంచి జగన్‌కు పిలుపు వస్తుందని ఆయన వర్గం గంపెడాశతో వుంది. కొన్ని పత్రికల్లో జగన్‌కు ఢిల్లీ నుంచి పిలుపు వచ్చిందంటూ వార్తలు రావడంతో జగన్ అభిమానులు ఆనందంతో కేరింతలు కొట్టారు. అవే పత్రికలు మరుసటిరోజు 'ఢిల్లీ పిలుపు క్యాన్సిల్' అంటూ వార్తలు ప్రచురించాయి. దీంతో జగన్ వర్గీయులు ఢీలా పడిపోయారు. అసలు ఢిల్లీ నుంచి ఎటువంటి పిలుపు రాలేదని, ఇదంతా మీడియా సృష్టేనంటూ ఢిల్లీ పెద్దలు ఖండించడంతో ఈ పిలుపులకు తెరపడింది.

## మంత్రి 'నోట్లు' బుట్టదాఖలు



రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి రాజనర్సింహకు, ఆ శాఖ కమిషనరు ఎ.ఆర్.సుకుమార్‌కు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోందట. వివిధ అంశాలకు సంబంధించి గత నాలుగునెలలుగా మంత్రి పంపిస్తున్న నోట్లను కమిషనర్ అస్సలు పట్టించుకోకుండా బుట్టదాఖలు చేస్తున్నాడట. ఇప్పటికి మంత్రి 31 నోట్‌లు పంపించాడట. ఒక్క నోట్‌కైనా కమిషనరు నుంచి సమాధానం రాక పోవడంతో విసిగిపోయి నోట్‌లు పంపడమే మానుకున్నాడట. మంత్రి హోదాలో కనీసం ఉద్యోగి ట్రాన్స్‌ఫర్ కూడా చేసుకోలేకపోతున్నానని, కమిషనర్ తనను ఏ మాత్రం లెక్కపెట్టడం లేదని తన సన్నిహితుల దగ్గర వాపోతున్నట్లు తెలిసింది. కమిషనర్‌ను అయినా మార్చండి లేదా మంత్రిత్వశాఖను అయినా మార్చమంటూ మంత్రి రాజనరసింహ ఇటీవలనే ముఖ్యమంత్రికి విన్నవించుకున్నాడట. అయితే ముఖ్యమంత్రి తనకు సన్నిహితుడంటూ కమిషనరు యథేచ్ఛగా మంత్రిని వ్యతిరేకిస్తున్నాడని సచివాలయ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి.

## మారెప్పకు మతి తప్పింది



నోటికి మాటకు సంబంధం లేకుండా మాట్లాడుతూ ఎప్పుడూ వార్తల్లో వుండే మాజీమంత్రి మారెప్ప మళ్లీ నోరు పారేసుకున్నాడు. వైఎస్‌ది ప్రమాదం కాదని, అది ముమ్మాటికీ హత్యేనంటూ ప్రకటించి వార్తలకెక్కాడు. రోశయ్యను కలవడానికి సిఎం ఛాంబర్‌కు వచ్చిన మారెప్పను మీడియావాళ్లు చుట్టుముట్టారు. ఎలక్ట్రానిక్ మైకుల గొట్టాలు ముందుకొచ్చేసరికి మారెప్పకు పూనకం వచ్చినట్లయింది. అంతే వెంటనే వైఎస్ హత్య వెనుక రాజకీయ కుట్ర వుందంటూ సంచలన ప్రకటన చేశాడు. దీనికి ఆధారాలేమైనా వున్నాయా? అని విలేకరులడిగితే నీళ్లు నమిలాడు. 'అబ్బే! ఎంక్వయిరీ చేయిస్తే సరి' అంటూ ముక్తాయింపుయిచ్చాడు.

## 'హరీశ్వర్' ఆగ్రహం



తెలుగుదేశం పార్టీ అధిష్ఠానంపై మాజీమంత్రి హరీశ్వర్‌రెడ్డి మండిపడుతున్నాడు. పార్టీ ఆవిర్భావం నుంచి సేవచేస్తున్న తనకు పొలిట్ బ్యూరోలో స్థానం కల్పించకపోవడమే హరీశ్వర్ కోపానికి కారణమంటున్నారు. పార్టీలో తన సామాజికవర్గం అంటే గిట్టనివాళ్లు 'బాబు'కు విషం నూరిపోస్తున్నారన్నది హరీశ్వర్ ఆరోపణ. కాగా పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో తనకిచ్చిన చిన్న పదవి అక్కర్లేదంటూ హరీశ్వర్ విసిరికొట్టాడు. హరీశ్వర్‌ను బుజ్జగించడం 'బాబు'కు కష్టంగానే వుందని పార్టీ కార్యాలయ వర్గాలు చెవులు కొరుక్కొంటున్నాయి.

## 'దివాకర్'కు జానా బ్రేకు



మాజీమంత్రి దివాకర్‌రెడ్డిని మీడియాతో ఎక్కువగా మాట్లాడవద్దంటూ జానారెడ్డి బ్రేక్ వేశాడు. జగన్‌కు వ్యతిరేకంగా ఈ మధ్య దివాకర్‌రెడ్డి మీడియాలో ఎక్కువగా మాట్లాడుతున్నాడు. దీనివల్ల పెద్దగా లాభం లేదని, జగన్ వ్యతిరేక ప్రచారాన్ని మానుకొని రోశయ్యకు అనుకూల ప్రచారాన్ని ఎక్కువ చేయాల్సిందిగా జానారెడ్డి హితవు చెప్పాడు. జగన్‌ను ఎలాగూ ముఖ్యమంత్రిని చేసేది లేదు గనుక ఆయనకు వ్యతిరేకంగా కాకుండా రోశయ్యకు మద్దతుగా మాట్లాడితే బాగుంటుందని జానా చెప్పాడట. దీంతో దివాకర్ మరుసటి రోజు నుండి తన పంథా మార్చుకొని రోశయ్య జిందాబాద్ అంటూ ఎత్తుకున్నాడు.

## సిఎం భద్రత తూ...చ్..!!



సిఎం భద్రత విషయంలో అధికారులకు బుద్ధి రావడం లేదు. మంగళవారం సిఎం ఛాంబర్‌లో ఫ్రీజోన్‌పై జరిగిన అఖిలపక్ష సమావేశానికి అనుకోని అతిథి రావడం కలవరం కలిగించింది. సిఎం ఛాంబర్‌లో జరిగే సమావేశాలకు హాజరయ్యేవారి జాబితా ముందుగానే తయారవుతుంది. జాబితాలో వున్నవారిని మాత్రమే అనుమతిస్తారు. అయితే మంగళవారం సమావేశానికి జాబితాలో లేని ఓ న్యాయవాది కూడా హాజరయ్యాడు. తీరా విషయం తెలిసిన మీదట సెక్యూరిటీ అధికారులు తలలు పట్టుకున్నారు. భద్రతాలోపం కారణంగా వైఎస్ ప్రమాదానికి గురికావడం, ఆ తర్వాత రోశయ్య హెలికాప్టర్ బురదలో కూరుకుపోవడం, ఆయన కూర్చున్న సోఫాకింద పాము కనిపించడం వంటి సంఘటనలు జరిగినా కూడా సిఎం సెక్యూరిటీ తప్పులు దిద్దుకోకపోవడం సచివాలయంలో చర్చనీయాంశమయ్యింది. మంగళవారం అగంతకుని ప్రవేశం సంఘటన తర్వాత సాక్షాత్తు హోం మంత్రి పోలీసు ఉన్నతాధికారులతో సిఎం భద్రతపై సమీక్ష నిర్వహించాల్సి వచ్చింది.




# భగవంతునికి ఎంతో ప్రీతికరమైన మాసం కార్తీకమాసం!





కార్తీకమాసం అన్ని మాసాల్లోకెల్లా విశిష్టమైనదని, ఈ మాసంలో కార్తీక దీపాలు వెలిగిస్తే జ్ఞానజ్యోతులు విస్తరింపజేసినట్లేనని పురాణాలు పేర్కొంటున్నాయి. శివుడికి, విష్ణువుకు ఎంతో ప్రీతికరమైన ఈ మాసంలో దానధర్మాలు, దీపారాధనలు, దీపదానాలు చేయడం వలన ఎంతో పుణ్యం లభిస్తుందని పురాణ కథనం. దీపావళి అమావాస్య మరుసటి రోజు పాడ్యమి నుంచి వచ్చే మాసమే కార్తీక మాసం. అక్టోబర్ 19 నుంచి నవంబర్ 16 వరకు కార్తీక మాసంగా పిలుస్తారు. భగవంతునికి ఎంతో ప్రీతికరమైన ఈ నెలలో ముప్పైముగ్గురు దేవతలు ఒకే చోట కొలువై వుంటారని ప్రతీతి. అందుకే ఈ మాసంలో ఎంతో నిష్ఠతో వుంటూ భగవదారాధన చేస్తుంటారు. ముఖ్యంగా శివాలయాల్లో కార్తీక సోమవారాల్లో దీపాలు వెలిగించి ప్రార్థిస్తారు. దీపం జ్ఞానానికి సంకేతం కనుక దీపదానం చేయడం ద్వారా జ్ఞానజ్యోతులు మరింత విస్తరింపజేయాలనే భావం ఇందులో ఇమిడి వుంది. ప్రత్యేకించి ఆకాశదీపాలు వెలిగించడం మోక్షప్రదం. కుండలో నూనె దీపాలు వెలిగించి ఆలయప్రాంగణంలో వాటిని తాడుతో కట్టి వేలాడదీస్తారు. ఇలా చేయడం వలన జన్మచరితార్థమవుతుందని, తమ నివేదనలు ఆ భగవంతునికి చేరుతాయని భక్తుల దృఢవిశ్వాసం. మహిళలు ఈ మాసంలో ఇంటి వద్ద తులసి చెట్టుకు పూజ చేసి దీపాన్ని వెలిగిస్తారు. లక్ష్మికి నిలయమైన తులసిని పూజించడం వలన శుభాలు కలుగుతాయని నమ్మకం.



కార్తీకమాసంలో తెల్లవారుజామునే లేచి సముద్రస్నానం, నదీస్నానం చేసి శివుడిని లేదా విష్ణువుని పూజించడం వలన పుష్కర తీర్థాలలో స్నానం చేసిన ఫలితం లభిస్తుంది. సర్వపాపాలు తొలగి పుణ్యఫలితాలు అందుతాయని ప్రతీతి. అలాగే పగలంతా ఉపవాసం చేసి రాత్రి భోజనం చేయాలనేది ఒక నియమం. పగలంతా నిరాహారంగా వుండలేని వారు పాల వంటి ద్రవపదార్థాన్ని కాని, పండ్లు వంటి వాటిని స్వీకరిస్తూ రాత్రి వేళ చంద్ర దర్శనం చేసుకొని దీపారాధన చేసిన అనంతరం భోజనం చేయాలి. ఈ మాసంలో కుటుంబ సమేతంగా వన భోజనాలుచేసే అలవాటు వుంది. పగటి వేళల్లో వేడిమిగాను, రాత్రి సమయాల్లో చల్లదనం కల్గివుండడం ఈ కార్తీక మాసం విశిష్టత. కార్తీక పురాణం, స్కందపురాణం వంటి ఎన్నో పురాణాల్లో, గ్రంథాల్లో కార్తీక మాసం విశిష్టత వివరించబడింది.

## ట్రంకు రోడ్డు కబుర్లు

### ముంగమూరు రుసరుసలు



తాను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకాకు తోకలా తిరుగుతున్నానని మీడియాలో వస్తున్న వార్తలు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిని బాధపెట్టినట్లున్నాయి. జడ్పీ మీటింగ్ హాల్‌లో జరిగిన జర్నలిస్టుల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన జర్నలిస్టులపై రుసరుసలాడారు. పత్రికలు పెరిగిపోయాయి. ఒక్కో పత్రిక ఒక్కో పార్టీ రంగును పులుముకుంది. యాజమాన్యాలు తమ కిష్టమొచ్చినట్లుగా వార్తలు వ్రాస్తున్నాయి. నేను ఆయన (వివేకా) ప్రక్కన తిరిగితే ఇష్టమొచ్చినట్లు రాసేస్తారు. నా వ్యక్తిత్వం గురించి తెలుసుకోండని యాష్టపోయారాయన.

### ఎసిబికి రాంగ్ కాల్స్



నెల్లూరు అవినీతి నిరోధక శాఖాధికారులంటే ఒకప్పుడు హడల్. పాత డిఎస్పీ మీసాల చౌదరి నిక్కచ్చిగా పనిచేసి ఎందరో అవినీతిపరులైన అధికారులను కటకటాల వెనక్కు పోయేలా చేశారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన అవినీతినిరోధక శాఖాధికారులు గతంలోలా వ్యవహరించకపోవడంతో అవినీతిపై నిత్యం ఉప్పందించే వారికి చిర్రెత్తింది. దీంతో ప్రతినిత్యం వీరు అక్కడా... ఇక్కడా బహిరంగంగా అవినీతి జరుగుతుందని కాయిన్ బాక్స్‌ల నుంచి ఎసిబి ఆఫీసుకు ఫోన్లు చేస్తున్నారట. సమాచారం వాస్తవమని అక్కడకు ఆఘమేఘాల మీద వెళ్తున్న అధికారులకు ఆయాసం తప్ప అవినీతిపరులైన అధికారుల ఆచూకీ లభ్యం కావడం లేదు. దీంతో నెల్లూరు ఎసిబి అధికారులు తమకు రాంగ్ కాల్స్ చేయవద్దని నీతిపరులను బతిమలాడుతున్నారు.

### విష్ణు మాయ



మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని కావలి నియోజకవర్గ అధికారులు ఇంకా ఎమ్మెల్యేగానే భావిస్తున్నారు. శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఆయనతోనే జరిపిస్తున్నారు. ఈ విషయమై కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు నెత్తినోరు బాదుకున్నా, స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానన్నా పట్టించుకొనేవారు లేరు. ఈ వారంలో బోగోలు మండలం పాత బిట్రగుంటలో కోటి రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన సిమెంటు రోడ్డును విష్ణుచేతనే ప్రారంభింపజేశారు. మొత్తం మీద కావలి అధికారులు విష్ణు మాయలో పడ్డారందామా?

### సింహపురిలో తిష్టవేసిన శాంభవి



బౌద్ధమత గురువు దలైలామాతో తనకు గతానుజన్మ బంధం వుందంటూ వార్తల్లోకి ఎక్కిన చిన్నారి శాంభవి గత మాసం రోజులుగా జిల్లాలోనే తిష్టవేసి కూర్చొంది. నెల్లూరు కన్యకాపరమేశ్వరమ్మ, జొన్నవాడ కామాక్షమ్మలతోపాటు అనుమసముద్రంపేటలోని ఖాజానాయబ్ రసూల్‌ను సందర్శించి వారితో మాటామంతీ కలిపి వచ్చానని చెబుతోంది. మామూలు సమయంలో తన వయస్సు పిల్లలతో ఆడుకొంటూ వుండే శాంభవి అకస్మాత్తుగా ఆధ్యాత్మిక చింతనలోనికి వెళ్లి భవిష్యవాణి చెప్తూ నెల్లూరీయులను బాగానే ఆకట్టుకొంటున్నది.

### పేరుకపోతున్న పాపిష్టి డబ్బు



నెల్లూరు నగర సిఐ వీరాంజనేయరెడ్డి అదో టైపు అధికారి. గతంలో అవినీతి నిరోధక శాఖలో పనిచేసిన ఆయన అవినీతి సొమ్మును అమేధ్యంగా భావిస్తుంటారు. దీనివల్ల నగరంలో ఒక్కో బ్రాందీ షాపు నుంచి సిఐ వాటాగా నెలకు వచ్చే పదమూడు వందల రూపాయలను తీసుకోవడం లేదాయన. దీంతో మామూలు వసూళ్లు చేస్తున్న పోలీసుల దగ్గర ఈ మొత్తం పేరుకపోయింది. బిగ్ బాస్ సలహాతో ఈ డబ్బును నెల్లూరు నగరానికి వచ్చే పోలీసు ఉన్నతాధికారులకు సకల సబ్బుందు సౌకర్యాలను సమకూర్చను ఖర్చుపెట్టాలని తీర్మానించారట. బాగుంది నెల్లూరు పోలీసుల వరుస.

**జమీన్‌రైతు**
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

# కోవూరులో తిష్టవేసిన సమస్యలు!

కోవూరు గ్రామాన్ని పలు సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. నిధుల కొరత లేకున్నప్పటికీ మారుమూల కాలనీలలో అభివృద్ధి పనులు కానరావడం లేదు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పంచాయితీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి చెందిన నరసయ్య సర్పంచ్‌గా ఎన్నికైనాడు. అప్పట్లో స్థానిక శాసనసభ్యులు కూడా కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కావడం వల్ల కోవూరు గ్రామ పంచాయితీకి అవసరమైన నిధులు మంజూరు కాకపోవడంతో అభివృద్ధి ఆశాజనకంగా లేదు.

కోవూరు గ్రామపంచాయితీలో 30వేల జనాభా, పదివేల కుటుంబాలు, 22వేల మంది ఓటర్లు వున్నారు. గ్రామ పంచాయితీకి ప్రతి సంవత్సరం వివిధ పన్నుల రూపంలో దాదాపు 22 లక్షల రూపాయలు జమ అవుతుంటాయి. ఇవి కాకుండా ఎస్ఎఫ్‌సి నిధులు లక్షా 50వేలు, 12వ ఆర్థిక సంఘం నిధులు ఎనిమిది లక్షలు మంజూరవుతున్నాయి. ఈ నిధులతో పంచాయితీ పరిధిలో సిమెంట్ రోడ్లు, త్రాగునీటి పైపుల ఏర్పాటు, గ్రావెల్ రోడ్ల తదితర నిర్మాణ పనులు చేస్తున్నారు. అయితే ఎస్సీ, ఎస్టీలకు చెందిన కాలనీలు మాత్రం చాలా దుర్భరంగా తయారైవున్నాయి.

ఈ గ్రామ పంచాయితీలో పనిచేసే పర్మినెంటు సిబ్బందికి ఆరునెలల నుంచి జీతాలు చెల్లించలేదు. జీతాలకు సంబంధించి ప్రభుత్వం గ్రాంటు విడుదల చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పంచాయితీ కార్యదర్శి సాయిప్రతాప్ చెప్పారు. పంచాయితీలో శివారున వున్న స్టాటీడి కాలనీ, పెళ్లకూరు కాలనీ, తదితర ప్రాంతాలలో పారిశుధ్యం, డ్రైనేజి కాల్వలు చాలా అధ్వాన్నంగా వున్నాయి. ప్రజలు వీటివల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయారు. పారిశుధ్యం, డ్రైనేజి కాల్వలు దుస్థితికి చేరుకోవడంతో దోమల బెడద ఎక్కువయ్యిందని స్థానికులు వాపోతున్నారు.



కోవూరు పంచాయితీ కార్యాలయం.

కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వర్గానికి చెందిన పంచాయితీ సర్పంచ్ నిధుల మంజూరుకు ఎటువంటి కృషి చేయడం లేదని తెలుస్తుంది. ఎమ్మెల్యే కూడా టిడిపి నుంచి సస్పెండ్ కావడం ఇందుకు కారణంగా చెప్పవచ్చు. మరో ఏడాదిలో గ్రామ పంచాయితీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో మేజర్ పంచాయితీగా పేరొందిన కోవూరుపై పట్టుసాధించేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు ఇప్పటి నుంచే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో పంచాయితీలో జరిగిన అభివృద్ధి పనులపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలు ప్రక్కనిస్తున్నాం.



### ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సమస్యలు!

కోవూరు గ్రామ పంచాయితీ పరిధిలో వున్న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం వుంది. అయితే ప్రభుత్వం వైపు నుంచి ఆశించినమేర నిధులు మంజూరు కాకపోవడం వల్ల పనులు చేపట్టలేకపోతున్నాం. మంజూరైన నిధులతో సిమెంటు రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది. పంచాయితీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాను.

– నరసింహారెడ్డి, కోవూరు పంచాయితీ సర్పంచ్



### దోమల బెడద!

కోవూరులో ఇటీవలకాలంలో దోమల బెడద ఎక్కువగా వుంటుంది. పారిశుధ్యం, డ్రైనేజి కాల్వలు సక్రమంగా లేకపోవడంతో మురికినీరంతా వీధులలోకి చేరిపోతుంది. ఇంతే కాకుండా వీధులలో వేసిన చెత్తాచెదారాన్ని ప్రతిరోజు తొలగించకపోవడం కూడా దోమలు చేరేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. ఇప్పటికైనా పంచాయితీ సిబ్బంది స్పందించి దోమల బెడద నివారణకు చర్యలు చేపట్టాలి.

– పద్మమ్మ, స్థానికురాలు

అవినీతి కథ

## నామినేషన్ పనుల్లో

# మేయర్, కమిషనర్ల మధ్య పేచీ!

> నెల్లూరు కార్పొరేషన్‌లో ఎక్కువగా జరిగే నామినేషన్ల పనుల్లో అధికార దృవాల మధ్య పొరపొచ్చాలు రావడానికి మామూళ్లే కారణమంటున్నారు.

పాలకవర్గం, అధికారులు అండదండలుంటే ఎంతటి పనినైనా చేజిక్కించుకోచ్చు. అధికారపార్టీకి చెందిన నేతల సిఫార్సు కూడా దీనికి తోడైతే ఎటువంటి ఇబ్బందులు ఎదురుకావు. దీంతో లక్షలాది రూపాయల పనులు దక్కించుకొనేందుకు మార్గం సులువవుతుంది. ఇందుకు వుదాహరణగా నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌ను చెప్పుకోవచ్చు. కార్పొరేషన్ పరిధిలో అత్యవసరంగా పనులు చేపట్టేందుకు ఎటువంటి టెండర్లు పిలువకుండానే నామినేషన్ పద్ధతిన పనులు కేటాయిస్తుంటారు. ఈ పనులు కేటాయించే క్రమంలో కూడా భారీస్థాయిలో అవినీతి, అక్రమాలు జరుగుతుంటాయి.

ప్రస్తుతం నగరంలో దాదాపు 40లక్షలకు పైగా నామినేషన్ పద్ధతిన పనులు మంజూరు చేయడం జరిగింది. కార్పొరేషన్ కమిషనర్ తనకు అనుకూలంగా వుండే కొద్దిమంది కాంట్రాక్టర్లకే ఈ పనులు అప్పజెబుతున్నారు. కాల్వల పూడికతీత, కల్వర్టుల నిర్మాణం తదితర పనులు కేటాయించడం జరుగుతుంది. ఐదు లక్షల రూపాయల విలువ చేసే పనులను మాత్రమే నామినేషన్ పద్ధతిన కేటాయించాలి. ఐదు లక్షలకు మించిన పనులను టెండర్ ద్వారా ఇవ్వాల్సివున్నా ఇక్కడ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఐదు లక్షలకు మించిన పనులను విభజిస్తున్నారు.

కార్పొరేషన్ ఏఇ, డిఇలు కమీషన్లకు కక్కుర్తిపడి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. పదిహేను శాతం కమీషన్ రూపంలో తీసుకుంటున్నారు. ఇటీవల కార్పొరేషన్ మేయర్ భానుశ్రీ, కమిషనర్ ఆంజనేయులుకు కమీషన్ల పంపకం విషయంలో విభేదాలు తలెత్తాయి. దీనిని ఆసరా చేసుకొన్న కమిషనర్ గత మేయర్ పులిమి శైలజకు అనుకూలంగా వున్న కాంట్రాక్టర్లను దగ్గరకు తీసి నామినేషన్ పనులను కేటాయించడం వీరిద్దరి మధ్య మరింత ఆజ్యం పోసినట్లయ్యింది. మేయర్ భానుశ్రీకి అనుకూలంగా వుండే అమీర్‌జాన్, బాషా, కృష్ణారెడ్డిలకు పనులు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు.

నామినేషన్ ప్రాతిపదికన పనులు మొత్తం "నోట్‌ఫైల్" ద్వారా జరిగిపోతున్నాయి. కమిషనర్ కూడా ఇక్కడ ఎవరికి తక్కువగా తినడం లేదు. ఎవరు ముందుగా తనకు రావాల్సిన కమీషన్ ముట్టజెపితే వారికి ఎటువంటి ఆలస్యం చేయకుండా బిల్లులు మంజూరు చేస్తుంటారు. మేయర్‌కు ఎటువంటి సమాచారం లేకుండానే నామినేషన్ పనులు కేటాయించడం పాలకవర్గంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. పాలకవర్గంలోని సభ్యులు కూడా దీనిపై బహిరంగంగా వ్యాఖ్యానించడం లేదు. కార్పొరేటర్ల డివిజన్లలో నామినేషన్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు ఎంతో కొంతవారికి ముట్టచెప్పి ఇబ్బందులు లేకుండా చేసుకొంటున్నారు.

నామినేషన్ పనులు కొంతమంది ఏఇలు కూడా బినామి పేర్లతో దక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ముందుగా




నిత్యం వివాదాల్లో నగర పాలక సంస్థ కార్యాలయం

వీరే పెట్టుబడి పెట్టి పనులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే కమీషన్ మాత్రం కమిషనర్‌కు ఇవ్వందే ఫైల్‌పై సంతకం చేయరు. డివిజన్లలో జరిగే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమాల ఏర్పాట్లకు నామినేషన్ వర్కు పొందిన వారే ఖర్చులు భరించాలన్న నిబంధనలు కూడా ముందుగానే విధిస్తున్నారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందర్భంగా నిధులు ఖర్చు చేసినట్లు కమిషనర్ కార్పొరేషన్ ఖజానా నుంచి తీసుకొంటారు.

39వ డివిజన్‌లో కార్పొరేటర్ సోదరుడు దాదాపు 90వేల రూపాయల పనిని నామినేషన్ పద్ధతిన తీసుకొని పూర్తి చేయడం జరిగింది. దీంట్లో కూడా అధికారులకు కమీషన్లు ఆశాజనకంగా లేకపోవడంతో పనుల్లో నాణ్యత లేదంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. కేటాయించిన పనిలో అందరికి కమీషన్లు ఇచ్చుకుంటూపోతే పనులు ఎంత నాణ్యతగా వుంటాయన్నది అధికారులకు తెలియనిది కాదు. పనులు మరింత నాణ్యతగా వుండాలంటే కార్పొరేషన్ కమిషనర్, ఇతర ఇంజనీర్లు అవినీతిగడ్డి తినకూడదు. నామినేషన్ ప్రాతిపదికన కేటాయించే పనులపై పూర్తిస్థాయి విచారణ జరిపితే నిధుల కేటాయింపు, అధికారుల బాధ్యత, పనుల నాణ్యత విషయం బహిర్గతమయ్యే అవకాశం వుంటుంది.



## సిమ్రాన్ మరో యత్నం

ఒకప్పుడు దక్షిణాదిలో అగ్ర కథానాయికగా ఏకచత్రాధిపత్యం ప్రదర్శించిన సిమ్రాన్ పెళ్లిచేసుకొని ఢిల్లీ వెళ్లిపోయింది. కొన్నాళ్లకు మళ్లీ వచ్చి రెండు తెలుగు సినిమాల్లో నటించినా అవి అంతగా ఆడలేదు. దీంతో ఈ మధ్య ఎక్సర్‌సైజులు గట్రాచేసి మరింత నాజూగ్గా తయారయ్యింది. తాను ఎవర్‌గ్రీన్ హీరోయిన్‌నని చాటను ఆమె ఏకంగా బికినీ షోకు రెడీ అయ్యింది. చూడాలి ప్రేక్షకులు ఆదరిస్తారో... నిరాదరిస్తారో.

## హాట్ హాట్‌గా మందిర



క్రికెట్ ఎక్స్‌ట్రా ఇన్నింగ్స్ ద్వారా అభిమానులకు పరిచయమైన మందిరాబేడి తర్వాత కాలంలో హాట్ హాట్ ఆంటీగా పలు సినిమాల్లోనూ కనిపించింది. వయసు మీద పడుతున్నా బికినీల్లో దర్శనమివ్వడానికి వెనుకాడని మందిర ఏం పెళ్లయితే ఎక్స్‌పోజింగ్ చేయకూడదా... గ్లామరస్‌గా కన్పించకూడదా అని గ్లామర్‌పై తన అభిప్రాయాన్ని గట్టిగానే చెబుతుంది. బికినీలో కన్పించినా, క్లీవేజ్ అందాలను ప్రదర్శించినా జనం మెచ్చుకుంటున్నారు కాబట్టి ఎక్స్‌పోజింగ్ విషయంలో వెనుకకు తగ్గనంటుందీ భామ.



## రేటు తగ్గించను!

నాకంటూ ఈ సృజనాత్మక రంగంలో వున్న మార్కెట్ పరిస్థితులను బట్టి ఓ నిర్దిష్ట మొత్తం పారితోషికంగా తీసుకోవాలని నిర్ణయించుకొన్నానని బెంగాలీ భామ బిపాసబసు చెబుతుంది. దానికి ఏమాత్రం తగ్గినా ఒప్పుకొని వెళ్లను. అది సినిమాలో ఓ పాత్ర ధరించడానికి కానివ్వండి, టీవీ షోకు కానివ్వండి. నిర్ణయించుకొన్న రేటుకు తగ్గి పాల్గొనే ప్రసక్తే లేదంది. విషయమేమిటంటే అమెరికాలో వివిధ ప్రదేశాల్లో మీట్ అండ్ గ్రేట్ అనే షోలో పాల్గొనమని అక్కడి నిర్వాహకులు బిపాసను అభ్యర్థించారు. కానీ ఆ అభ్యర్థనతోపాటు ఆఫర్‌చేసిన సొమ్ము మాత్రం బిపాసకు నచ్చలేదు. దీంతో తాను పాల్గొనని మొహమాటం లేకుండా చెప్పేసింది. బోల్డంత ప్రచారం వస్తుందని నిర్వాహకులు చెప్పినా నాకు ప్రచారం కన్నా పైసలు ముఖ్యమని బిపాస తేల్చి చెప్పింది.

## మాట వినని నయన



జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నయనతార, షీలా హీరోయిన్లుగా వి.వినాయక్ దర్శకత్వంలో అదుర్స్ చిత్రం తయారవుతున్న సంగతి పాఠకులకు విదితమే. ఈ సినిమాలో ఓ సీన్‌కు నయనతార ఎక్స్‌పోజింగ్ డ్రస్ వేసుకోవాలని వి.వినాయక్ చెప్పడంతో అందుకామె తిరస్కరించినట్లు సమాచారం. మరి నయనతార ఎందుకలా ప్రవర్తించిదో ఆమెకే తెలియాలి. ఎప్పుడూ ఎక్స్‌పోజింగ్ విషయంలో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించే ఈ అమ్మడు వినాయక్ వంటి దర్శకునికి ఎదురు తిరిగిందంటే ఈమెకు తెలుగులో ఇక అవకాశాలు మృగ్యమేనని ఫిల్మ్‌నగర్‌వర్గాలు సణుగుతున్నాయి.

## తెలుగులో దున్నేస్తా!



కాస్త ఒళ్లు తగ్గిన హీరోయిన్ నమిత హుషారుగా కనిపిస్తుంది. సింహ షూటింగ్ గ్యాప్‌లో పిచ్చాపాటీగా మాట్లాడుతూ నటి అన్నాక అన్నిరకాల పాత్రలు చేసినప్పుడే ప్రతిభ అనేది బయటపడుతుంది. ఏదో ఒకరకమైన పాత్రలకే పరిమితమైతే కెరీర్ ఇక అటకెక్కినట్లే. అందుకే నేను నా చిత్రాల విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటానంది. తెలుగులో ఆమె నటిస్తున్న జగన్మోహిని విడుదలవగా, దేశద్రోహి చిత్రంతోపాటు బాలకృష్ణ సరసన సింహలో నటిస్తున్న నమిత నా ఈ చిత్రాలు విడుదలైతే టాలీవుడ్‌లో ఇక హవా తనదేనంటుంది. తెలుగు చిత్రాల ద్వారా పరిచయమైన నమితను తమిళ చిత్రసీమ బాగా ఆదరించింది. మళ్లీ ఇప్పుడు ఆమెకు తెలుగులో అవకాశాలు హెచ్చాయి. ఇదంతా తన అదృష్టమంది ఈ ముద్దుగుమ్మ.

చిత్ర సమీక్ష

## సాదాసీదాగా బెండు అప్పారావు

అల్లూరు రహీం

తెలుగు చలన చిత్రపరిశ్రమలో తనదంటూ ప్రత్యేకతను చాటుకొన్న జంధ్యాల హాస్యచిత్రాల స్కూల్ నుంచి వచ్చిన దర్శ



కుడు ఇవివి సత్యనారాయణ. ఈయన దర్శకత్వంలో తయారైన 49వ చిత్రమే బెండు అప్పారావు. దీన్ని సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై డి.రామానాయుడు నిర్మించారు. బెండు అప్పారావుగా ఇవివి కుమారుడు నరేష్ నటించాడు. హాస్యం పండాలంటే కాస్త అతికి వెళ్లాలి. కానీ బెండు అప్పారావులో ఈ అతి కాస్త ఎక్కువయ్యింది. బూతు మార్గాన పయనించింది. ఈ చిత్రానికి కథాబలం కూడా కరవయ్యింది. ఇవివికి స్క్రీన్‌ప్లేపై వున్న పట్టుతో ఈ చిత్రాన్ని లాగించే పనిలో పూర్తిగా కృతకృత్యుడు కాలేకపోయాడు. ఇటలీ, జర్మనీ, ఆస్ట్రేలియాలలో తీసిన నాలుగు పాటలు దృశ్యపరంగా బాగున్నా సంగీత, సాహిత్యపరంగా పేలవంగా వున్నాయి. సంగీత దర్శకుడు కోటి మనసు పెట్టి రాగాలు కూర్చలేదన్న విషయం ఈ చిత్రం పాటలు వినే ప్రతి ప్రేక్షకునికి అర్థమైపోతుంది. ఆర్‌ఎంపి డాక్టర్ అయిన బెండు అప్పారావు కత్తితో ఓ పేషెంట్ చెయ్యి కోసి రక్తం క్రిందపడగా చుట్టూ చీమలు చేరితే షుగర్ వ్యాధిగా నిర్ధారించడం, ఆహుతి ప్రసాద్ ఇంటికొచ్చే అతిథులకు అతి మర్యాదలు చేయడం; అలీ, సుమన్‌శెట్టి, ఉత్తేజ్, ఎల్బీ శ్రీరాం, శ్రీనివాసులురెడ్డి, కొండవలస, ధర్మవరపు సుబ్రహ్మణ్యం కాంబినేషన్‌లో నడిచే కామెడీ సన్నివేశాలు కాసేపు నవ్వుకొనేలా చేస్తాయి. చాలా వరకు చండాలపు డైలాగులు వ్రాసిన మాటల రచయిత వెధవలకు కలసి వస్తుంది. రాజకీయ నాయకుడు ఓటున్న వారితో వుంటాడు. పెళ్లాం వదిలేసిన మగాడు వెధవ వంటి క్యాచి డైలాగులు వ్రాశాడు. ఇవివి సత్యనారాయణ చిత్రాల్లో మంచి హీరోయిన్లు వుంటారు. కానీ ఈ చిత్రంలోని మెయిన్ హీరోయిన్ కామ్న జఠ్మలానీ కన్నా ఒకే ఒక్క పాటలో కనిపించే మేఘన ప్రేక్షకులకు కంటినిండుగా కనిపించిందనాలి. రొటీన్‌గా రీళ్లు చుట్టేయడం వల్ల బెండు అప్పారావు ఓ సాదా సీదా చిత్రంగానే మిగిలిపోయిందనాలి.

చిత్ర కథలోనికి వెళ్తే బొబ్బర్లంకలో ఆర్‌ఎంపి డాక్టర్‌గా ప్రాక్టీసు చేస్తుండే బెండు అప్పారావు(అల్లరి నరేష్) జనానికి అవసరమైన దానికంటే ఎక్కువగా వైద్యంచేస్తూ ఫీజులు గుంజుకొంటుంటాడు. ఈ డబ్బునంతా తన చెల్లెల్ని వరకట్న వేధింపులకు గురిచేసే బావ చిట్టిబాబు(కృష్ణభగవాన్)కు పంపుతుంటాడు. గ్రామపెద్ద సూర్యనారాయణరాజు (ఆహుతి ప్రసాద్) తల్లి (తెలంగాణా శకుంతల)కు వైద్యం చేయను వెళ్లే అప్పారావును టెన్త్ పరీక్షలు ఎన్నో సార్లు తప్పే ఆయన కూతురు పద్మ(కామ్న జఠ్మలానీ) ప్రేమిస్తుంది. ఓ రోజు మిత్రులు వీరబాబు(ఉత్తేజ్), బాబ్జి(శ్రీనివాసులురెడ్డి)లతో కలసి ప్రక్క ఊరికి సెకండ్ షోకు వెళ్లి వస్తుండే అప్పారావుకు రోడ్డు ప్రమాదానికి గురై మరణానికి చేరువగా వుండే శివాజీ అనే యువకుడు కనిపిస్తాడు. అతను 15 లక్షల రూపాయలను బెండు అప్పారావు చేతికిచ్చి తన తండ్రి నరసింహమూర్తి(దీక్షితులు)కు అందివ్వమని కళ్లు మూస్తాడు. శివాజీ చెప్పిన ప్రకారం ఆ ఊరికి వెళ్లినా నరసింహమూర్తి ఆచూకీ తెలియదు. దీంతో ఈ మొత్తాన్ని రక్షణ కోసం గ్రామంలోని పోస్ట్‌బాక్స్‌లో మూతపెట్టి వేసి తాళాలు తన దగ్గర పెట్టుకొంటాడు బెండు అప్పారావు. నరసింహమూర్తి ఆచూకీ దొరకనందువల్ల ఆ డబ్బులో కొంత మొత్తం ఇస్తే తాము దుబాయి వెళ్లి బాగుపడతామని వీరబాబు, బాబ్జిపై వత్తిడి చేస్తారు. దీంతో వారిద్దరికీ చెరి రెండు లక్షలిచ్చి మిగతా మొత్తంలో బొబ్బర్లంకలో శివాజీ పేరిట స్కూల్ కట్టిస్తాడు అప్పారావు. ఈ స్కూల్ ప్రారంభోత్సవానికి కలెక్టర్ (డి.రామానాయుడు) వస్తారు. అప్పారావును అభినందిస్తాడు. అంత డబ్బు అప్పారావు బృందానికి ఎలా వచ్చిందన్న విషయమై ఆరాతీస్తుండే గ్రామసర్పంచ్(చలపతిరావు) ఓసారి అప్పారావు, అనుకోని రీతిలో అసలు నిజాన్ని ఎల్బీశ్రీరాంకు చెప్పడాన్ని వింటాడు. ఇంతలో శివాజీ పేరిట కట్టించిన స్కూల్‌లో టీచర్‌గా పనిచేయను అతని చెల్లెలు గాయత్రి (మేఘన) వస్తుంది. ఈ విషయం తెలుసుకొన్న అప్పారావు కష్టాల్లో వుండేవారి కుటుంబాన్ని ఆదుకోను ఆమెను పెళ్లిచేసుకోను సిద్ధమవుతాడు. గ్రామసర్పంచ్ ఈ సందర్భంగా పెద్ద గలాటానే చేస్తాడు. చివరిలో సూర్యనారాయణరాజు ఎంట్రీ ఇచ్చి అప్పారావు మంచి మనసు విషయమై గ్రామస్తులకు వివరించడంతో వారంతా ఆలోచనలో పడతారు. అంతిమంగా అప్పారావు పద్మను పెళ్లిచేసుకోవడంతో కథ సుఖాంతమవుతుంది.

## చోటిస్తేచాలు

మొదటి పేజీ కొరవ

సోనియాగాంధీ ఆలోచన కాదని, ఆ ఆశ కూడా నెరవేరక పోవచ్చునని జగన్ అనుమానం. దానితో, తనను రాష్ట్ర రాజకీయాలలో కొనసాగిస్తే చాలనే ప్రతిపాదన అధిష్ఠానం ముందు పెట్టాలని ఆలోచన చేస్తున్నాడు. పులివెందుల టిక్కెట్ తనకు ఇచ్చి, రోశయ్య క్యాబినెట్‌లో ఒక మంచి పోర్టుఫోలియోతో మంత్రిపదవి ఇస్తే చాలుననేది జగన్ అభిప్రాయం. తద్వారా రాష్ట్రంలో తనతో వున్న ఎమ్మెల్యేలను పట్టుకొని రావచ్చునని; ప్రభుత్వంలో తనకున్న పనులు సజావుగా జరిపించుకోవచ్చునని ఆయన తలపోస్తున్నాడట.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అకాల మరణం చెందడం వల్ల, ఆయన నడిపిస్తున్న వ్యాపారపరమైన ఫైళ్లు అసంఖ్యాకంగా పెండింగ్‌లో వున్నాయి. వేల కోట్ల రూపాయల ఒప్పందాలతో ముడిపడిన ఫైళ్లు అవి. చేవెళ్ల ప్రాణహిత, పోలవరం వంటి ప్రాజెక్టు పనులలో వైఎస్‌కు, ఆయా కాంట్రాక్టర్లకు అవగాహన కుదిరిపోయి వుంది. తాను రాష్ట్ర మంత్రివర్గంలో చేరగలిగితే, ఇటువంటి ఒప్పందాల సొమ్ము తాను దక్కించుకోవచ్చునని జగన్ ఆశ పడుతున్నాడని తెలుస్తుంది. రాదని తెలిసిన పదవి కోసం వృధాగా ప్రయాసపడడం కంటే కళ్ల ముందు కన్పిస్తున్న వేలకోట్ల రూపాయల లాభాన్ని మూట కట్టుకోవడం తెలివైన పని అన్నది ఆయన ఆలోచన. తాను మంత్రివర్గం బయటవుంటే, రోశయ్య ఆ ఒప్పందాలను గౌరవిస్తాడని, ఫైళ్ల మీద సంతకాలు పెడతాడని నమ్మకం లేదు. వివాదాలకు దూరంగా తొలగిపోయేతత్వం రోశయ్యది. తాను లోపలే వుండి, అధిక సంఖ్యలో ఎమ్మెల్యేలను తనతోనే వుంచుకొంటే ఎవరు ముఖ్యమంత్రిగా వున్నా తన మాట కాదనలేరన్నది జగన్ వ్యూహం. ఒక్క ఓబుళాపురం ఇనుప ఖనిజం గనిలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించిన సర్వే జరిపిస్తే, జగన్‌కు, ఆయన వ్యాపార భాగస్వాములకు రోజుకు ఐదు కోట్ల రూపాయల నష్టం వస్తుందని అంచనా. రిజర్వు ఫారెస్టు భూములలో, పక్కన వున్న ఇతర గనులలో అక్రమంగా మైనింగ్ చేస్తూ వస్తున్నారు ఇంతకాలం. కేంద్ర ప్రభుత్వం ఎంత ఒత్తిడి చేసినా, హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా లెక్క చేయకుండా ఈ అక్రమ మైనింగ్‌కు అండగా నిలిచాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి. సర్వేకు వచ్చిన కేంద్ర బృందాలను బెదరించి వెనక్కు పంపేశారు. ఇప్పుడు రోశయ్యతో కానీ, కేంద్ర నాయకులతో కానీ పేచీ పెట్టుకొంటే ఈ మైన్ సర్వే జరిపించడం ఖాయం. దానివల్ల జరిగే నష్టం ఏటా వెయ్యి కోట్ల రూపాయలకు పైమాటే. అంత లాభాన్ని వదలుకొనే వెర్రివాడు కాదు జగన్.

ఇప్పుడు ఆయన చేయవలసిన ఏకైక కార్యక్రమం – అదుపు తప్పి మాట్లాడుతున్న తన వర్గం ఎమ్మెల్యేలు, మంత్రుల నోటికి తాళం వేయడం. ఢిల్లీ నుంచి తిరిగి రాగానే ఆయన చేయబోయే పని అదిగానే వుంటుంది. తిరుగుబాట్లు, గిరుగుబాట్లకు స్వస్తి చెప్పి, సర్దుబాటుకు గౌరవప్రదమైన మార్గాలను వెతుకుతున్నారు ఆ వర్గీయులు.

## కెవిపి

మొదటి పేజీ కొరవ

నికి కారణం ఆయనే అనే ప్రచారం మొదలు పెట్టారు. ఈ భావన జనంలో కూడా వుందా లేదా అన్న సంగతి తెలియదు. వైఎస్ మరణానంతరం హైదరాబాద్‌లో కానీ, ఢిల్లీలో కానీ జరిగిన ప్రతి పరిణామాన్ని వారిద్దరు మాత్రమే చర్చించుకొన్నారు. మరొకరికి నిజానిజాలు తెలియవు. వైఎస్ కుటుంబ సభ్యులు తనను నిందిస్తున్నారన్న విషయం కెవిపికి కూడా తెలుసు. అయితే, ఆయనది గుంబన స్వభావం. తన మనసులోని భావనలను మాటల రూపంలో కానీ, ముఖ కవళికల రూపంలో కానీ బయట పెట్టక పోవడం కెవిపి ప్రత్యేకత. ఎంతటి సంతోషాన్నైనా, మనోవేధననైనా మనసులోనే దిగమ్రింగుకోవడం అలవాటు. ఇప్పుడు కూడా అదే చేస్తున్నాడు. అయితే తన తండ్రి స్నేహధర్మాన్ని జగన్ కొనసాగిస్తాడా అన్నది ప్రశ్న. ఈ ప్రచారాలను జగన్ కూడా నమ్మితే కెవిపి ఒంటరి వాడైపోతాడు. తన తండ్రి వలె జగన్ కూడా ఎవరేమి చెప్పినా కెవిపిలోని నిజాయితీని, తమ కుటుంబం పట్ల భక్తి ప్రపత్తులను విశ్వసిస్తే, ఆ ప్రమాదం తప్పుతుంది.

## జనవాణి

2వ పేజీ కొరవ

భాషకు ప్రాచీన హోదా తెచ్చిపెట్టారు. పెన్షన్లు, రెండు రూపాయలకు కిలో బియ్యం పథకంతో సామాన్యుల అభిమానాన్ని సంపాదించారు. ఈ పథకాలన్నీ రద్దు కాకుండా చూసి మరింతగా ప్రయోజనం చేకూరిస్తేనే రోశయ్యను జనం అభిమానిస్తారు.

*జి.రామయ్య, గూడూరు.*

### కమర్షియల్‌గా కృష్ణాఎక్స్‌ప్రెస్

ఎన్నో ఏళ్లుగా రైలు ప్రయాణీకులు ఎక్కువగా ఉపయోగిస్తున్న రైలు కృష్ణా ఎక్స్‌ప్రెస్. ఈ రైలులో సామాన్య ప్రజానీకం, వ్యాపారులు, విద్యార్థులు, పుద్యోగస్తులు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ఈ రైలును ఆదిలాబాద్ వరకు పొడిగించారు. అంతటితో వూరుకోక ఈ రైలుకు రిజర్వేషన్ స్లీపర్ కోచ్‌లతో పాటు డి-సీరియల్స్‌తో సీటింగ్ రిజర్వేషన్‌కు అధికభాగం కోచ్‌లు కేటాయించారు. దీనివల్ల కృష్ణాఎక్స్‌ప్రెస్ కీర్తి మసకబారి ప్రయాణీకులు ఇబ్బందిపడుతున్నారు.

*సిహెచ్.సురేష్‌బాబు, నెల్లూరు*

### డిజిపిగా గిరీష్‌కుమార్ సమర్థుడు

రాష్ట్ర డిజిపిగా గిరీష్‌కుమార్ నియామకం సమర్థనీయం. పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన ఈ అధికారి తెలుగువాడు. నిజాయితీగా, నిక్కచ్చిగా ప్రతిచోట పనిచేశాడు. 1984 – 1986 మధ్య నెల్లూరు ఎస్పీగా పనిచేసిన గిరీష్ కుమార్ ప్రజల వినతులు స్వీకరించే విధానాన్ని పోలీసుశాఖలో ప్రవేశపెట్టిన అధికారి. అటువంటి ఈయన డిజిపిగా పారదర్శకంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందుతారన్న నమ్మకం వుంది.

*బి.శాలి, నెల్లూరు*



వరద బాధితులకు నాలుగు లక్షల రూపాయల విరాళాన్ని అందించమని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెక్కును అందిస్తున్న ఆత్మకూరువాసి మెట్టుకూరు ధనుంజయరెడ్డి, రాపూరు మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ చెన్ను బాలకృష్ణారెడ్డి. ప్రక్కన మంత్రి రామనారాయణరెడ్డి కూడా వున్నారు.

## నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

కిటలాడుతుంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తులు పొంగళ్లు నైవేద్యంగా పెడుతున్నారు. ఆ తర్వాత మైపాడు తీరానికి సముద్ర స్నానానికి తరలి వెళ్తున్నారు.

## వికలాంగుల ధర్నా

వికలాంగురాలైన మహబూబ్‌నగర్ దేవరకద్ర వ్యవసాయ అధికారిణి రాజేశ్వరి మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి 21వ తేది కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించింది. సమితి జిల్లా అధ్యక్షుడు గూడూరు వెంకటరమణయ్య, మహిళా కన్వీనర్ కూనపురెడ్డి అరుణ ధర్నాకు నాయకత్వం వహించారు.

## ఘరానా దొంగ అరెస్ట్

జిల్లాలో పలు దొంగతనాలు చేసిన ఘరానా దొంగ వెందోడు చంద్రను నెల్లూరు సంతపేటలోని నాలుగుకాళ్ళ మండపం వద్ద పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రెండు లక్షల 50వేల రూపాయల విలువ చేసే బంగారు వస్తువులు స్వాధీనం చేసుకొన్నట్లు నెల్లూరు నగర డిఎస్పీ రాధిక చెప్పారు. చంద్రపై గూడూరు, శ్రీకాళహస్తి, తిరుపతి, వెంకటాచలసత్రం, విడవలూరు స్టేషన్ల పరిధిలో కేసులు నమోదై వున్నాయి. ఇతని అరెస్టులో నెల్లూరు టూటౌన్ క్రైం ఎస్ఐ రంతుమియా, సూళ్లూరుపేట ఎస్ఐ శ్రీనివాసరావు గట్టి కృషి చేసినట్లు డిఎస్పీ చెప్పారు.

## హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

నెల్లూరు మాగుంట లేఔట్‌లోని హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీసు ఆర్గనైజేషన్ నిర్వాహకుడు టి.కృష్ణారెడ్డి నాయుడుపేటలోని మేరీ వృద్ధుల ఆశ్రమానికి పదివేల రూపాయలు విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ద్వారా ఆశ్రమ నిర్వాహకులకు అందించారు. అదే విధంగా రేపల్లె వరద బాధితులకు అందించమని ఐదువేల రూపాయల విలువచేసే దుప్పట్లను రాజీవ్‌భవన్‌కు కృష్ణారెడ్డి చేర్చారు. నెల్లూరులోని వియానీ చిన్నపిల్లల ఆశ్రమానికి పదివేల రూపాయల విలువ చేసే గీజరు పైపులను కూడా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అందించింది.

## పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ సహాయం

నెల్లూరుజిల్లా పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ కర్నూలు వరద బాధితులకు సాయం అందించింది. నెల్లూరు నుంచి బియ్యం, బట్టలు, మంచినీటి బాటిళ్లు, మెడికల్ కిట్‌తో బయలుదేరిన పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టోని వీటిని పంచలింగాల గ్రామంలో పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పవన్‌కళ్యాణ్, అల్లు అర్జున్ అభిమానులు రాజేష్, అనిల్, అశోక్, సుకుమార్, రాకేష్, శ్రావణ్, జమీర్ పాల్గొన్నారు.

## "ఎక్స్‌రే" అవార్డులు!

విజయవాడ నుంచి వెలువడే సాహిత్య పత్రిక ఎక్స్‌రే జాతీయ స్థాయిలో కవితల పోటీలను నిర్వహిస్తుంది. అవార్డుకు ఎంపికైన కవితకు ఐదువేల రూపాయల నగదుతో పాటు సత్కారం, మరో పది కవితలకు ఉత్తమ కవితా పురస్కారాలు ఇస్తారు. కవితలను ఎక్స్‌రే, పోస్ట్‌బాక్స్ నెం.340, డోర్ నెం. 28–15–2, కొల్లూరి టవర్స్, దాసు వారి వీధి, అరండాల్ పేట, విజయవాడ–2 చిరునామాకు నవంబర్ 30తేదీలోగా పంపాలంటున్నారు నిర్వాహకులు.

## లాఫింగ్ క్లబ్ విరాళం

వరద బాధితుల సహాయార్థం నెల్లూరు లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఈదూరు సుధాకర్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు 10 వేల రూపాయల విరాళాన్ని కలెక్టర్ రామ్‌గోపాల్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో బి.వి.నరసింహులు, ఎన్.బలరామనాయుడు, దోర్నాదుల హరిబాబు, వంజువాక సతీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్ఆర్‌కె స్కూల్ విరాళం

నెల్లూరు మాగుంట లే-ఔట్‌లోని ఎస్ఆర్‌కె హైస్కూల్ అధినేత కృష్ణమూర్తి వరద బాధితుల సహాయార్థం లక్ష 50వేల రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధికి పంపారు.

## చంద్రారెడ్డి డిగ్రీ కాలేజి సాయం

వరద బాధితులకు నెల్లూరు చంద్రారెడ్డి డిగ్రీ కాలేజి విద్యార్థులు, స్టాఫ్, మేనేజ్‌మెంట్ కలసి సేకరించిన విరాళం 50 వేల రూపాయలను కాలేజి డైరెక్టర్ చంద్రారెడ్డి, కరస్పాండెంట్ కె.ప్రతాప్‌రెడ్డిలు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిని కలిసి అందించారు.

# నెల్లూరులో వంట గ్యాస్ సిలిండర్లకు కటకట!

జిల్లాలో వంట గ్యాస్ పంపిణీ గాడి తప్పింది. గృహావసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లు ప్రక్కదారి పడుతుండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ సిలిండర్ బుక్ చేసి 25రోజులు పైబడినా పంపిణీ జరగకపోవడంతో సిలిండర్ల కోసం గ్యాస్ ఏజన్సీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో భారం మోయలేక అల్లాడుతున్న ప్రజలకు గ్యాస్ సిలిండర్లు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాయి. జిల్లావ్యాప్తంగా 3,46,686 గ్యాస్ కనెక్షన్లు వున్నాయి. రెండు సిలిండర్లను వినియోగించేవారు 91,948 మంది వుండగా, సింగిల్ సిలిండర్ వినియోగదారులు 1,31,053 మంది వున్నారు. దీపం పథకం క్రింద గ్యాస్ వినియోగించేవారు 1,03,685 మంది వుండగా వీరందరికి గ్యాస్ సరఫరా సక్రమంగా జరగడం లేదు. సిలిండర్ల పంపిణీ అస్తవ్యస్తం కావడానికి, అధికంగా బ్లాక్‌మార్కెట్‌కు తరలి వెళ్లడానికి కారణం వాణిజ్య అవసరాలకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్ల ధర ఒక్కసారిగా పెరగడమే. 700 రూపాయలు వున్న దీని ధర 912 రూపాయలయ్యింది. ఉన్నపళంగా 212 రూపాయలు పెరగడంతో వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు కమర్షియల్ సిలిండర్లను ఉపయోగించకుండా, గృహావసరాలకు సరఫరా చేసే సిలిండర్లను వినియోగిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నది. ఏజన్సీల నిర్వాహకులు వినియోగదారుల సంగతి ప్రక్కన పెట్టి వ్యాపార అవసరాలకు సిలిండర్లను సప్లై చేయడంలో ఆదాయం వుంటుండడంతో వారి అవసరాలు తీర్చడంలో కనపర్చే శ్రద్ధ గృహావసర వినియోగదారుల పట్ల చూపించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో సిలిండర్లకు డిమాండ్ ఏర్పడి 309.55 రూపాయలున్న సాధారణ గ్యాస్ సిలిండర్ బ్లాక్‌లో ఒక్క సిలిండర్ 500 నుంచి 650 రూపాయల ధర పలుకుతుంది. దీనినిబట్టి గ్యాస్ వినియోగదారుల అవసరాలను ఏజన్సీలు ఏ విధంగా తమ ఆదాయవనరుగా మార్చుకొంది స్పష్టమవుతున్నది.

హిందూస్థాన్ ఆయిల్ కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుంది. ఇండేన్ గ్యాస్, భారత్ గ్యాస్, హెచ్‌పి గ్యాస్ వాడకంలో వున్నా అధికంగా వినియోగించేది ఇండేన్‌గ్యాస్ సిలిండర్లు. గ్యాస్ బుక్ చేసుకొన్న వినియోగదారులకు 25 రోజులు గడుస్తున్నా సిలిండర్ సరఫరా చేయకపోవడంతో ఏజన్సీల వద్ద వినియోగదారులు బారులు తీరి కన్పిస్తున్నారు. మరొకవైపు ప్రభుత్వ నిబంధన లేకపోయినా ఒకసారి బుక్ చేసుకొన్న తర్వాత 21రోజుల వరకు తిరిగి గ్యాస్ బుక్ చేయరాదని ఏజన్సీ నిర్వాహకులు చెప్పడాన్ని వినియోగదారుల తప్పుబడుతున్నారు. గ్యాస్ సిలిండర్ల పంపిణీ సక్రమంగా జరిగేందుకు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్నో చర్యలు చేపడుతున్నా అవి నిష్ప్రయోజనమే అవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు కొందరు వ్యాపారస్తులతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని వుండడంతో గృహఅవసరాలకు అందించాల్సిన గ్యాస్ ప్రక్కదారి పడుతుండడంతో ఈ సమస్య తలెత్తుతున్నదనేది అందరికీ తెలిసిన సత్యం. ఇంతగా ప్రజలు అవస్థలు పడుతున్నా పౌరసరఫరాలశాఖాధికారులు, సిబ్బంది కుంభకర్ణ నిద్రలో వుంటుండడంతో వినియోగదారులకు గ్యాస్ కష్టాలు తీరడం లేదు.





### సక్రమంగా లేదు

గ్యాస్ సిలిండర్ బుక్ చేసి 20 రోజులు గడుస్తున్నా ఇంతవరకు సిలిండర్ సప్లై చేయలేదు. ఏజన్సీ నిర్వాహకుల వద్దకు పలుమార్లు తిరుగుతున్నా ఏమి ప్రయోజనం వుండడం లేదు. పైగా విసుక్కోవడం, దురుసుగా సమాధానం చెప్తున్నారు. అధికంగా డబ్బు చెల్లించేవారికి మాత్రం క్షణాల్లో సిలిండర్ అందిస్తున్నారు. అధికారులు దీనిని అరికట్టి గ్యాస్ సక్రమంగా అందేలా చూడాలి.

చిన్నమ్మ, నెల్లూరు



### హోటళ్లకు సరఫరా అడ్డుకోవాలి!

ఇంటి అవసరాలకు వినియోగించాల్సిన సిలిండర్లు వ్యాపార అవసరాలకు వాడుతుండడం వల్లనే గ్యాస్ సరఫరా ఆలస్యం కావడానికి ప్రధాన కారణం. తక్కువ ధరకు దొరికే సిలిండర్లను నగరంలోని హోటళ్ల నిర్వాహకులు తమ స్వార్థం కోసం ఏజన్సీలతో కుమ్మక్కై సిలిండర్లను పెద్ద ఎత్తున మళ్లిస్తుండడంతో వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదు.

కె.రమణారెడ్డి, నెల్లూరు



### గాడిలో పెట్టాలి!

చాలాకాలంగా సిలిండర్ల సరఫరాలో అవకతవకలు జరుగుతున్నాయి. ఎక్కడో చోట సరఫరాలో ఏర్పడిన అవాంతరాలను అవకాశంగా చేసుకొని గ్యాస్‌ఏజన్సీల నిర్వాహకులు, సిబ్బంది వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారు. అధికారులు జోక్యం చేసుకొని గ్యాస్ పంపిణీని గాడిలో పెట్టాల్సిన అవసరం వుంది.

సురేష్, నెల్లూరు



### చాలా ఇబ్బందిగా వుంది!

గ్యాస్ అయిపోయి దాదాపు నెల అవుతున్నా సిలిండర్లు అందకపోవడంతో ప్రత్యామ్నాయం వెతుక్కోవాల్సి వస్తోంది. ముఖ్యంగా సకాలంలో సిలిండర్లు అందని కారణంగా మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. ఎవరికి చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదు.

శోభ, నెల్లూరు



### సక్రమంగా జరిగేలా చూస్తాం!

జిల్లాలో గ్యాస్ సిలిండర్ల సరఫరాలో కొంత మేర ఇబ్బంది వున్న మాట వాస్తవం. గ్యాస్ సప్లై చేసే సంస్థలలో తలెత్తిన ఇబ్బందుల వల్ల ఈ సమస్య ఉత్పన్నమైంది. త్వరలో సమస్యను పరిష్కరిస్తాం. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లు ఎక్కడైనా వ్యాపారాలకు వాడినట్లయితే ఏజెన్సీలు, వ్యాపార సంస్థలపై కఠిన చర్యలు తీసుకొంటాం.

సౌరబ్‌గౌర్, జాయింట్ కలెక్టర్.

## • గ్లోబల్ సిగలో మరోమణిమకుటం

# అవేర్ గ్లోబల్ హాస్పిటల్!

నెల్లూరీయుడు, ప్రపంచ ప్రఖ్యాతి పొందిన గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్ నెలకొల్పిన గ్లోబల్ హాస్పిటల్స్‌కు ఎంతో పేరు ప్రఖ్యాతులున్న సంగతి తెలిసిందే. దేశంలో గుండె, కాలేయ మార్పిడులు చేస్తున్న ఏకైక హాస్పిటల్ గ్లోబల్. హైదరాబాద్, బెంగుళూరు, మద్రాస్, బొంబాయి, కలకత్తా, భువనేశ్వర్ తదితర ప్రాంతాలలో ఈ సంస్థ ఆసుపత్రులను ఏర్పాటుచేసి ప్రజలకు మెరుగైన వైద్యసౌకర్యాలను అందిస్తోంది. ఒక్క హైదరాబాద్‌లోనే పలుచోట్ల గ్లోబల్ హాస్పిటల్స్ ఏర్పాటై వున్నాయి. క్రొత్తగా ఎల్‌బినగర్ బైరామల్‌గూడలో అవేర్ గ్లోబల్ హాస్పిటల్ పేరుతో మరో శాఖను ఏర్పాటుచేశారు నిర్వాహకులు. అక్టోబర్ 11వ తేదీన ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుపుకొన్నది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సర్వాధినేత ఎన్.చంద్రబాబునాయుడు, బిజెపి జాతీయ నాయకుడు ఎం.వెంకయ్యనాయుడు తదితర ప్రముఖులు హాజరయ్యారు.

అవేర్ గ్లోబల్ హాస్పిటల్ 300 పడకలతో, పూర్తి సౌకర్యాలు, అత్యాధునిక వసతులతో కూడిన ఆపరేషన్ థియేటర్, ఇంటెన్సివ్ కేర్ సౌకర్యాలను సామాన్యులు సైతం భరించేలా తక్కువ ఫీజుతో ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ రవీంద్రనాథ్ చెప్పారు. అడ్వాన్స్‌డ్ ట్రామా కేర్ సెంటర్ ఇక్కడ అందుబాటులో వుంది. కార్డియాలజీ, కార్డియో థొరసిక్ సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ సమస్యలకు అత్యాధునిక చికిత్స అందించడంతోపాటు కాలేయ వ్యాధులకు అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్ అందిస్తామన్నారు. తమ హాస్పిటల్ లక్ష్యం ప్రపంచస్థాయి వైద్యాన్ని సామాన్యులకు అందించడమేనని తెలిపారు. సమర్థవంతమైన డాక్టర్ల బృందంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, క్రొత్త పరికరాలను ఉపయోగించి చక్కని వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యం అన్నారు. కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలో మద్రాస్‌లో ఏర్పాటు చేసిన తమ హాస్పిటల్ అరుదైన ఘనత సాధించిందని రవీంద్రనాథ్ తెలిపారు. సేలం రోడ్డు ప్రమాదంలో మరణించిన ఒక యువకుని శరీరంలో నుంచి సేకరించిన కాలేయాన్ని రెండు భాగాలు చేసి కాలేయ వ్యాధితో బాధపడుతున్న ఇరువురు రోగులకు అమర్చామన్నారు. 20 గంటలపాటు నిర్వహించిన ఈ శస్త్రచికిత్స కాలేయ మార్పిడిలో పేరొందిన వైద్యనిపుణుడు డాక్టర్ రేలా ఆధ్వర్యంలో జరగడం అభినందనీయం అన్నారు. దేశంలోనే ఇలాంటి శస్త్రచికిత్స చేయడం ప్రథమం అని, ఇప్పటివరకు తమ ఆసుపత్రులలో 80 కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగినట్లు రవీంద్రనాథ్ వివరించారు.



హైదరాబాద్‌లోని బైరామల్‌గూడలో ఏర్పాటు చేసిన అవేర్ గ్లోబల్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రోశయ్య. ప్రక్కన చంద్రబాబునాయుడు, వెంకయ్యనాయుడులతో హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ కె.రవీంద్రనాథ్.

# కొరివి పెడుతున్న కెసిఆర్!

తన చేతుల నుంచి జారిపోయిన తెలంగాణా ఉద్యమాన్ని మళ్లీ చేజిక్కించుకోవడానికి టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చేస్తున్న ప్రయత్నాలు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. పదేళ్ల నుంచి తెలంగాణా ఉద్యమాన్ని పటిష్టంగా నడుపుతున్న కెసిఆర్, మొన్నటి ఎన్నికలలో దారుణంగా దెబ్బతిన్నాడు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజకీయ చతురత ముందు కెసిఆర్ వ్యూహరచనా పాటవం చతికిలపడి పోయింది. టిడిపితో జత కట్టడం ద్వారా ఇటు రాష్ట్ర శాసనసభలో, అటు పార్లమెంటులో పెద్ద సంఖ్యలో స్థానాలు సంపాదించి, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను ఒక ఆట ఆడించాలని తలపోశాడు కెసిఆర్. కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్న అంచనాతో, ఎల్‌కె అద్వాని తెలంగాణాకు అనుకూలం కాబట్టి, వారికి తన మద్దతు అందించి, తెలంగాణా సంపాదించిన వీరుడిగా చరిత్రలో నిలిచిపోతానని కలలు కన్నాడు. కానీ వైఎస్ చరిష్మా ఆ కలలను కల్లలు చేసింది. రెండు చట్ట సభలలోనూ టిఆర్ఎస్ నామమాత్రా వశిష్టమైంది. దీనితో ఇక తెలంగాణా ఉద్యమం చరిత్ర దావానలం వలె పెంచడానికి ఈ తీర్పు నిష్పురవ్వగా వాడుకొన జూస్తున్నాడు. దానితో శాంతి భద్రతలకు కొరివి పెట్టాలన్నది ఆయన ప్రయత్నం. అసలే బలహీనంగా వున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి ఉద్యమాలు నిలువరించే, ఎదిరించే పరిస్థితి ఉందన్నది ఈ వ్యూహానికి ప్రాతిపదిక.

అయితే కెసిఆర్ ఆశలు ఫలిస్తాయా అన్నది వేరే విషయం. గత పది పదిహేనేళ్లుగా విద్యావ్యవస్థలో వచ్చిన మార్పు, ఉద్యోగాల విషయంలో యువతరంలో వచ్చిన ఆలోచనల మార్పు రాష్ట్రంలో రాజకీయ ఉద్యమాలకు ప్రతికూలంగా వున్నాయి. అంతకు క్రితం విద్యార్థుల చదువు సంధ్యలు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో మాత్రమే నడిచేవి. దానితో విద్యార్థులకు రాజకీయ ఆలోచనలకు ఆస్కారం, ఉద్యమాలలో పాలు పంచుకొనే అవకాశం దొరికేవి. కానీ ఇప్పుడు నూటికి తొంభై శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో చదువుతున్నారు. అక్కడ చదువుకు తప్ప మరొక ఆలోచనకు ఆస్కారం లేదు. పొద్దున ఐదు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు చదువుతోనే సరి

## హైదరాబాద్ ఫ్రీజోన్ అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉద్యమంగా మలచాలని చూస్తున్నాడు

చెత్తబుట్టలో చేరి పోతుందని, కెసిఆర్ తెరమరుగై పోతాడని పరిశీలకులు అంచనా వేశారు. వైఎస్ బ్రతికివుంటే అది జరిగి వుండేది కూడా.

కానీ వైఎస్ అకాల మరణంతో కెసిఆర్‌కు పోయిన ప్రాణం లేచి వచ్చింది. రాష్ట్ర కాంగ్రెస్‌కు సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడం, ముఖ్యమంత్రి రోశయ్య రాజకీయసవాళ్లను ధీటుగా ఎదుర్కొనే సత్తా కల్గినవాడు కాకపోవడం, కాంగ్రెస్ పార్టీ కలహాల కాపురంగా మారడం కెసిఆర్‌కు అనుకూలిస్తున్నది. దానితో ఆయన ఒక పథకం ప్రకారం కొన ఊపిరితో వున్న తెలంగాణా ఉద్యమాన్ని తిరిగి బ్రతికించడానికి సన్నాహాలు చేస్తున్నాడు. అయితే ఇంతకాలం ప్రజాస్వామ్యయుతంగా, కేవలం ఉపన్యాసాలు, ఊరేగింపులు, సభలు, ఎన్నికలకు పరిమితంగా శాంతియుతంగా నడిపిన ఉద్యమ దిశను ఉద్రేకాల వైపు మళ్లించడానికి నిర్ణయం తీసుకోవడమే ఆందోళన కల్గించే అంశం.

తెలంగాణా ప్రాంతంలో నివాసం వుంటున్న ఆంధ్రుల మీద దాడులు చేయడం, వారి వ్యాపార సంస్థల ఎదుట ప్రదర్శనలకు దిగడం, తెలంగాణాలో బ్రతకలేమనే భయాన్ని కల్గించడం కెసిఆర్ వ్యూహంగా కన్పిస్తున్నది. ఇందుకోసం ఆయన ప్రభుత్వ ఉద్యోగులను, విద్యార్థి సంఘాలను, నక్సలైట్ సంస్థలను రంగంలోకి దింపడానికి ప్రయత్నిస్తున్నాడు. ప్రజలలో ఆవేశకావేశాలను రెచ్చ గొట్టడానికి పథకాలు రచిస్తున్నాడు. హైదరాబాద్ నగరం అటు ఆంధ్ర, ఇటు తెలంగాణా కాని ఫ్రీజోన్ అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కెసిఆర్‌కు కలిసి వచ్చింది. ఉద్యమాన్ని ఒక పోతుంది. విద్యార్థి సంఘాలు లేవు. ఉద్యమాలు అసలే లేవు. గతంలో అందరి దృష్టి ప్రభుత్వ ఉద్యోగం మీద మాత్రమే కేంద్రీకృతమయ్యేది. వాటి సంఖ్య తక్కువ కావడం, వాటిని కోరే వారు అసంఖ్యాకంగా ఉండడంతో విద్యార్థులలో తమ భవిష్యత్తు పట్ల నిర్దిష్ట ఆశలు, అంచనాలు వుండేవి కావు. కానీ ఇప్పటి పరిస్థితి వేరు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూసే వారి సంఖ్య చాలా తక్కువ. సాఫ్ట్‌వేర్, మేనేజమెంట్, బ్యాంకింగ్, కమ్యూనికేషన్స్, మార్కెటింగ్ వంటి రంగాలలో అసంఖ్యాకంగా ఉద్యోగ అవకాశాలు పెరగడం వల్ల యువత చూపు అటు వైపు మళ్లింది. ఎవరి ప్రమేయం, సిఫార్సు లేకుండా కేవలం తమ చదువు, తెలివితో ఉద్యోగాలు సంపాదించుకోగలమన్న నమ్మకం పెరిగింది. ఆ ఉద్యోగాలతో తమ జీవితాలు సుఖప్రదంగా, తమకు కోరుకొన్న రీతితో వుంటాయన్న ఆశ కల్గింది. దానితో యువతరం రాజకీయాల పట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఉద్యమాల జోలికి అసలే వెళ్లడం లేదు.

ఈ పరిస్థితిలో 1969 నాటి పరిస్థితులను మళ్లీ సృష్టించడం కెసిఆర్ వల్ల అయ్యే పని కాదన్నది పరిశీలకుల అంచనా. ఆయన ప్రయత్నం ప్రమాదకరమైనదే అయినప్పటికీ అంత త్వరపడి భయపడాల్సింది ఏదీ లేదని భావిస్తున్నారు. ఏది ఏమైనా రానున్న మూడు నాలుగు నెలలు తెలంగాణా ఉద్యమానికి చాలా కీలకమైన దశ. కెసిఆర్ ఒక్కడే పోరాటంలో మిగిలితే ఈ వ్యూహం పెద్దగా ఫలించక పోవచ్చు. నక్సలైట్ సంస్థలు, ఆ భావజాలం వున్న మేధావులు, విద్యార్థి సంఘాలు ఆయనతో చేతులు కలిపితే మాత్రం కొంత జాగ్రత్త పడక తప్పదు.

# అక్కడ జన సందోహం ఇక్కడ పరాభవ ఉక్రోషం!

## రాజీవ్, ఇందిరాభవన్‌లలో రంజైన రాజకీయం

కాంగ్రెస్ సభ్యత్వాల సమీకరణ కార్యక్రమం నెల్లూరు నగరంలో మంచి సందడే చేసింది. జనార్ధనరెడ్డి పుణ్యాన గత ఇరవై ఏళ్లుగా నెల్లూరు నగరంలో కాంగ్రెస్ కార్యక్రమం అంటే ఆనం వారి స్వంత ఇంటి వ్యవహారంగా నడిచింది. కానీ మొన్నటి ఎన్నికల నుంచి పరిస్థితిలో మార్పు. కేవలం 90 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థిగా ఓడిపోయిన అనిల్‌కుమార్ యాదవ్, నెల్లూరు నగర నియోజకవర్గంలో కాంగ్రెస్ పెత్తనం నాది అని ముందుకు రావడంతో ఆనం కుటుంబం ఖంగుతిన్నది. మొదట మొదట అనిల్‌ను ఒక పిల్లకాకిగా చూశారు వారు. గట్టిగా వూదితే గాలికి ఎగిరిపోతాడని భ్రమించారు. కానీ అనిల్‌కుమార్ వెనుక కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వై.వి.రామిరెడ్డి కొండంత అండగా నిలవడం, ఆదాల ప్రభాకర్ రెడ్డి, కాకాణి గోవర్ధనర్‌రెడ్డి ఆశీర్వాదాలు అందించడంతో ఏకులాగా వచ్చిన అనిల్ మేకుగా స్థిరపడిపోయాడు. తమ కార్యకలాపాల కోసం వారు పెట్టుకొన్న రాజీవ్‌భవన్ జిల్లాలో ఒక ప్రధాన రాజకీయ కేంద్రంగా ఎదిగిపోయింది. ఆనం కుటుంబం మీద కసి కోపం వుండి, వారిని ఎదిరించి బ్రతకలేమనే నిరుత్సాహంతో నీరసపడి వుండిన వర్గాలన్నీ రాజీవ్‌భవన్‌లో ఆశ్రయం పొందుతున్నాయి. రాజకీయాలతో ఏ మాత్రం సంబంధం లేనివారు కూడా ఆనం వారి అరాచక ప్రవర్తనకు నిరసనగా రాజీవ్‌భవన్‌కు వస్తున్నారు. కార్యక్రమాలలో పాలు


ఇందిరాభవన్‌లో వెలవెల

పంచుకొంటున్నారు. తమంత తాముగా సహకారం అందజేస్తున్నారు. కృష్ణానది వరద సహాయం సేకరణలో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపించింది. వేలాదిమంది ప్రజలు స్వచ్ఛందంగా రాజీవ్‌భవన్‌కు తరలివచ్చి తమకు తోచిన సహాయం అందజేశారు. ఎన్ని లారీలకు ఎక్కించినా ఇంకా సామగ్రి అందిస్తున్నారంటే రాజీవ్‌భవన్ పట్ల నెల్లూరు ప్రజలలో పెరిగిన ఆసక్తి, అనురక్తి ఎంత ప్రగాఢంగా వున్నాయో అర్థం చేసుకోవచ్చు. మంత్రిపదవితో సహా రాజకీయ పెత్తనం మొత్తాన్ని తమ గుప్పెట్లో పెట్టుకొని వున్న ఆనం కుటుంబం ఒక్క లారీకి సరిపడా కూడా వరద సహాయం సేకరించలేకపోయింది. వారి వైపు ముఖం చూపించిన దాతలే లేరు.

ఈ నేపథ్యంలో జరిగింది కాంగ్రెస్ సభ్యత్వాల సేకరణ కార్యక్రమం. 21తేది ఉదయం రాజీవ్‌భవన్ కిక్కిరిసి పోయింది. విజయమహల్ గేట్ పరిసరాలు జనసందోహంతో నిండిపోయాయి. అంతటి స్పందనను ఎవరూ వూహించలేదు. అంతకుక్రితమే, రాజీవ్‌భవన్ నిర్వాహకులలో ఒకరైన కార్పొరేటర్ రూప్‌కుమార్ యాదవ్ అంగడి గదులను నిర్దాక్షిణ్యంగా కూలగొట్టడం, మేయర్ భానుశ్రీ అనిల్ వర్గాన్ని వెటకారంగా మాట్లాడడం, దానిపై వైవి.రామిరెడ్డి విరుచుకపడి భానుశ్రీ అక్రమ ఆస్తులు 100 కోట్లు దాటాయని, వాటిపై ఎసిబికి ఫిర్యాదు చేయబోతున్నామని


రాజీవ్‌భవన్‌లో కిటకిట

ప్రకటించడంతో వేడెక్కి వుండిన వాతావరణం వల్ల ఉపన్యాసాలు ఘాటుగా సాగాయి. ఆనం వారి మీద నేరుగా విమర్శనాస్త్రాలు సంధించారు వైవి.రామిరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, పేరూరి నరసింహులు శెట్టి, ఉడతా వెంకట్రావు తదితరులు.

పొద్దుటి నుంచి ఈ సందడి చూస్తుండిన ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిలో ఉక్రోషం పెరిగిపోయింది. దీనికంటే ఎక్కువ జనంతో తనూ ఒక కార్యక్రమం జరపాలని సాయంత్రం ఇందిరాభవన్‌లో సభ పెట్టాడు. నగరంలో తన పలుకుబడి అంతా ఉపయోగించి జన సమీకరణ చేశాడు. ప్రజారాజ్యం ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి కూడా దానికి జనాన్ని తోలారు. అయితే అంత ప్రయత్నం చేసినా ఇందిరాభవన్ నిండడమే కనాకష్టమైపోయింది. రాజీవ్‌భవన్ సభతో పోలిస్తే బాగా పలచగా కనపడింది. దానితో వివేకా ఉక్రోషం ఆపుకోలేకపోయాడు. రైలు కట్టకు అవతల కాంగ్రెస్ పేరుతో గొడవ చేస్తున్న వారి అంతు చూస్తానని, తాట వలుస్తానని, ఏదోఒక రోజు వారంతా రైలు పట్టాల మీద ఎముకలు ఏరుకోవాల్సి వస్తుందని సహనం కోల్పోయి మాట్లాడాడు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి బ్రతికి వున్నంత కాలం కుక్కల వలె పడివున్నారు. ఇప్పుడు పెద్ద పులుల వలె విర్రవీగుతున్నారని ఆక్రోశం వెలిబుచ్చాడు. అయితే వైఎస్ బ్రతికి వున్నప్పుడే రాజీవ్‌భవన్ పెట్టిన సంగతి, తమకు సవాల్ విసిరిన సంగతి మర్చిపోయినట్లున్నాడాయన. మంత్రి రామనారాయణ మాత్రం కొంత నిగ్రహం పాటించాడు. జన సమీకరణ రాజకీయ ఆదరణకు సంకేతం కాదని, ఇప్పుడు తాము వెనుకపడినా అవసరం వచ్చినప్పుడు తమ సత్తా చూపిస్తామని గంభీరంగా ప్రకటించాడు. మొత్తం మీద రాజీవ్‌భవన్, ఆనంవారి కంట్లో నలుసుగా తయారైందని అందరికీ అర్థమైంది. ఈ పోరాటం రేపటి మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ఏ తీరులో వుండబోతుందో వేచి చూడాలి.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.